RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/


సంపుటి :21 సంచిక 104 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి బుధవారం 15-4-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥ త్రయోదశి రా॥8.23, పూ.భాద్ర మ॥1.19, వర్జ్యం రా॥ 10.44 -12.19, దుర్ముహూర్తం ఉ॥ 11.39-12.27, శుభ సమయం ఉ॥ 10.30-12.00, రాహుకాలం మ॥12.00-1.30, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం 2లో

## అంబేద్కర్‌కు మోదీ నివాళులు

– దేశ నిర్మాణంలో అంబేద్కర్ కృషి అపూర్వం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ఆర్ఎన్ఎ):** డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేద్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు. మరోవైపు అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సిఎం రేవంత్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్ర ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే అంబేద్కర్ వాదులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయణ్ని గుర్తు చేసుకుంటున్నారు.




## క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా అమరావతి


– తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ సెంటర్‌కు శ్రీకారం – భవిష్యత్‌లో కీలక శక్తిగా మారనుందన్న సీఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రేపటి ప్రపంచాన్ని శాసించే టెక్నాలజీకి కేంద్రంగా అమరావతి సాంకేతిక రంగం సంబంధించి మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశంలో మొట్టమొదటి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని సీఎం మిగతా 2లో..

## సౌరశక్తితో విద్యుత్ ఆదా

■ఆదాయం కూడా తెచ్చి పెడుతుంది

■స్పీకర్ అయ్యన్న పాత్రుడు



**అనకాపల్లి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సౌర శక్తి ద్వారా విద్యుత్ సమస్యను పరిష్కరించుకోగలమని సభాపతి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అధిక బిల్లులు వస్తున్నాయని బాధపడేవారు వెంటనే సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు నియోజకవర్గంలో 2000కుపైగా గృహాల్లో సోలార్ యూనిట్లను ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు. వారు వాడుకోగా మిగిలిన విద్యుత్తు ఏపీ ట్రాన్స్‌కో తీసుకొని గృహ వినియోగదారులకు బిల్లు చెల్లిస్తుందన్నారు. నాతవరం, గొలుగొండ, కేడీ పేట ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను నేతలు ప్రారంభించారు. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీ సోలరైజేషన్ పక్రియను స్పీకర్, హోంమంత్రి ప్రారంభించారు. హోం మంత్రిగా ఎలా ఉండాలో అనిత నిరూపించారని, అసెంబ్లీలో కూడా ఆమె మిగతా 2లో..

## రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా వైకాపా ఉన్మాదం

– గత ఐదేళ్లు అరాచక పాలన సాగించిన ఘనులు... ఇప్పుడేమో అభివృద్ధికి మోకాలడ్డే యత్నాలు


– మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పార్థసారథి

**అమరావతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలం ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందని మంత్రి పార్థసారథి అన్నారు. అధికార మదంతో విర్రవీగిన వైసీపీ నేతలు, సామాన్యుల నుంచి ప్రతిపక్ష నేతల వరకు ఎవరినీ వదలకుండా వేధింపులకు గురిచేశారని రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారని గుర్తు చేశారు. వైసీపీ సాగించిన ఈ 'ఉన్మాద రాజకీయాలు' చివరకు ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి పార్థసారథి గత ప్రభుత్వంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అరాచకాలు సృష్టించారు.



ప్రతిపక్షాలపై భౌతిక దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం ద్వారా వారి గొంతు నొక్కారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో రాష్ట్రంలో అశాంతి రాజ్యమేలింది. ప్రజల ఆస్తులను కబ్జా చేయడం, ప్రకృతి వనరులను దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీ నేతలు, రాష్ట్రాన్ని అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని అన్నారు. జగన్ ఏం చెబితే అది చేస్తాం.. ఆత్మాహుతి దళంగా పనిచేస్తామంటున్నవారు నాయకులా..? లేక ఉగ్రవాదులా? అని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర వినాశనం కోరుకుంటున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్రనాయకత్వం ఆలోచనలో తప్పు ఉంటే చర్చించాల్సింది మిగతా 2లో..


## ఇకపై లోక్‌సభలో 850 స్థానాలు..?



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ఆర్ఎన్ఎ):** నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. ఆ ప్రతులను వారికి పంపింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెంచనున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల మిగతా 2లో..

## నారీశక్తికి మద్దతు ఇవ్వండి

– పార్టీ అధ్యక్షులకు సిఎం చంద్రబాబు లేఖ



**అమరావతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళా రిజర్వేషన్ 'నారీ శక్తి వందన్' చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు కోరుతూ రాజకీయ పార్టీల అధ్యక్షులకు, రాష్ట్రంలోని రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. 2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న 'నారీ శక్తి వందన్' బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు పలకాలని లేఖలో కోరారు. జనసేన మిగతా 2లో..

## వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు

– చట్టసభల్లో వారి ఉనికి చాటేందుకు అవకాశం: దేశ మహిళలకు లేఖలో ప్రధాని మోదీ వెల్లడి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ఆర్ఎన్ఎ):** రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని, దీంతో మన రాజ్యాంగం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన దేశ మహిళలకు ఓ లేఖ రాసి దాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ప్రస్తుతం పలు రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారు. అదేవిధంగా చట్ట సభల్లోనూ వారి ఉనికిని చాటేందుకే ఈ రిజర్వేషన్ల పక్రియ మొదలుపెట్టాం. పార్లమెంట్‌లో ఏప్రిల్ 16 నుంచి జరగనున్న మూడు రోజుల సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' బిల్లులో సవరణలు ప్రవేశపెడతాం. దీనిపై ఏమాత్రం ఆలస్యం జరిగినా అది భారతదేశ మహిళలకు అన్యాయం చేసినట్టే.

2029 లోక్‌సభ ఎన్నికల సమయానికి మహిళల రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని అంటూ దేశ మహిళలకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. భారతదేశ కుమార్తెలు వారి హక్కుల కోసం జీవితాంతం వేచి చూడటం సబబు కాదు. చట్టసభల్లో వారి గొంతుకను గట్టిగా వినిపించే సమయం వచ్చింది. దీంతో ప్రజాస్వామ్యం కూడా దృఢంగా మారనుంది. జరగబోయే పార్లమెంట్ సమావేశానికి, రాజ్యాంగ సవరణ ఆమోదం కోసం, దేశం నలుమూలలా ఉన్న కోట్లాది మంది మహిళల ఆశీస్సులు కోరుకుంటున్నాను. మీరంతా మీ స్థానిక ఎంపీలకు లేఖ రాసి పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని వారిని కోరండి' అని మోదీ ఆ లేఖలో రాసుకొచ్చారు. 2023 పార్లమెంటు సమావేశాల్లో నారీ శక్తి వందనం అధినియమ్' రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన ఈ బిల్లులో సవరణలు జరుగుతున్నాయి. లోక్‌సభలో 1/3 వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని నిర్ణయించారు. అంటే మొత్తం 816 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు దాదాపు 273 సీట్లను కేటాయించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు.

## నాతవరంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

– స్పీకర్ అయ్యన్న, హోంమంత్రి అనిత నివాళి



**అనకాపల్లి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాతవరంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి మిగతా 2లో..

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# యుద్ధోన్మాద మత్తు దిగితేనే.... ప్రపంచశాంతి !

నోబెల్ శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. యుద్ధోన్మాదిగా మారాడు. ఆయనకు తోడుగా ఇజ్రాయల్ ప్రధాని బెంజ్‌మెన్ న ఎతన్యాహు తోడయ్యారు. వీరిద్దరు కలసి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న తీరుతో ప్రపంచ దేశాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే అమెరికా ఎంతగా నష్టపోయినా సరే ట్రంప్ మాత్రం యుద్ధాన్ని వీడేది లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. చర్చలు విఫలం అయితే దానికి ఎక్కువ బాధ్యత అమెరికాదే. ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టిందే వారు. ఇప్పుడు దానికి అణుబూచి రంగు పులిమి ఇరాన్‌ను దెబ్బతీయాలని చూడడం సరికాదు. నిజానికి ప్రపంచదేశాలు ట్రంప్ తీరుపై గళమెత్తాలి. కానీ ఏ దేశం పెద్దగా పట్టించుకోవడం లేదు. భారత్ కూడా మాటకూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే ఇప్పుడు యుద్ధం ముగించకుంటే చమురు మంటలు అన్ని దేశాలను దహించి వేస్తాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడుతారు. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. పాకిస్థాన్ వేదికగా జరిగిన ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లే కన్పించినా.. చివరి నిమిషంలో వీటికి బ్రేక్ పడింది. ఇందుకు కారణం అణు కార్యకలాపాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడమేనని తాజాగా తెలిసింది. 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధి నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదన పెట్టగా, అందుకు ఇరాన్ నిరాకరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. యురేనియం శుద్ధిని ఐదేళ్ల పాటు మాత్రమే నిలిపివేస్తామని టెహ్రాన్ చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు అగ్రరాజ్యం సమ్మతించకపోవడంతోనే చర్చలు ఆగిపోయినట్లు తెలిపాయి. వాస్తవానికి టెహ్రాన్ శాశ్వతంగా యురేనియం శుద్ధిని నిలిపివేయాలని ట్రంప్ యంత్రాంగం ముందునుంచీ డిమాండ్ చేస్తోంది. కానీ చర్చల సమయంలో దాన్ని 20 ఏళ్లకు తగ్గించడం గమనార్హం. అయితే ఈ పీటముడి ఇలాగే ఉంటుందా... అమెరికా మళ్లీ యుద్ధానికి కాలుదువ్వుతుందా అన్న ఆందోళన ప్రపంచ దేశాలను కలచివేస్తోంది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా– ఇరాన్ మధ్య ఈ స్థాయిలో అత్యున్నత స్థాయి సమావేశం జరగడం మళ్లీ ఇప్పుడే. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ భేటీలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ సహా ఇరుదేశాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు 20 గంటల పాటు ఈ చర్చలు సాగాయి. 80 శాతం అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఒప్పందం దాదాపు కుదిరినట్లుగానే కన్పించింది. కానీ, కాసేపటికే అవి విఫలమయ్యాయని పాక్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ చర్చలు పూర్తిగా నిలిచిపోలేదని, రెండోదశ ముఖాముఖి భేటీకి ఇరుదేశాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. డీల్ కుదుర్చుకునేందుకు తాము సుముఖంగానే ఉన్నామని ఇరాన్ తమతో చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చలు సాఫీగా సాగేలా పట్టువిడుపులు ఉండాల్సిందే. దెబ్బతిన్న ఇరాన్ పునరుద్ధరణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎందుకంటే చమురు సంక్షోభం ముదరకుండా చూసుకోవాలి. ఇప్పటికే బ్యారెట్ ధర 113 డాలర్లకు చేరింది. ఇది ఆయా దేశాలపై మోయలేని భారం చూపనుంది. అందుకే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది. దాంతో రానున్న వారాల్లో చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కూడా హెచ్చరించారు. హర్మూజ్‌లో నౌకల రాకపోకలు మొదలైనా.. రవాణా మునుపటి స్థాయికి చేరేవరకు ఈ మోత ఉంటుందని హెచ్చరించారు. హర్మూజ్ లో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో పెరిగే వరకు ఇంధన ధరల అధికంగా ఉండొచ్చు. పెరుగుతూనే ఉండొచ్చు .కూడా యుద్ధం ముగిస్తే తప్ప చమురు ధరలు తగ్గొచ్చని అందరూ అంచనా వేస్తున్నారు. ఇక నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల వరకు ఇంధన ధరలు ఎక్కువగానే ఉండొచ్చని ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సూచనప్రాయంగా వెల్లడించారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మార్చి నెలలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తి భారీగా తగ్గిందని ఒపెక్ విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడవుతోంది. ఇరాక్‌లో దాదాపు 61శాతం మేర ఉత్పత్తి తగ్గింది. ఫిబ్రవరిలో రోజుకు 4.2 మిలియన్ బ్యారెళ్ల నుంచి మార్చిలో రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. కువైట్‌లో 53శాతం, యూఏఈలో 44 శాతం, సౌదీ అరేబియా 23 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. ఇక చమురు సరఫరాలో కీలకమైన పైప్‌లైన్ ఇరాన్ దాడుల్లో దెబ్బతినడంతో రోజూవారీ 7 మిలియన్ల బ్యారెళ్ల నుంచి 7 లక్షల బ్యారెళ్లకు పడిపోయిందని సౌదీ మీడియా వెల్లడించింది. మొత్తంగా ఒపెక్ దేశాలు చేసే ఉత్పత్తి 27 శాతం మేర కుంగింది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం అమెరికా నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. అందుకు తగ్గట్టే ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోకుండా.. అమెరికా ఆంక్షలున్న చైనా ట్యాంకర్ హర్మూజ్‌ను దాటింది. మరిప్పుడు దీనిపై యూఎస్ నౌకాదళం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది. మొత్తంగా ఈ దోబూచులాట ఆగాలి. చమురు దేశాలు స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునే స్థితి రావాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి వస్తుంది. ట్రంప్ కూడా మూర్ఖంగా ముందుకు వెళ్లకుండా ప్రపంచశాంతికి కట్టుబడి ఉండాలి.

# బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

కొత్త సిఎంగా బిజెపికి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక

నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్



**పాట్నా,ఏప్రిల్14(ఆర్ఎన్ఎ):** బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్లు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్లు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

# శ్రీశైలంలో భారీగా మద్యం పట్టివేత

ఐదురుగు మహిళల అరెస్ట్

**నంద్యాల, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీశైలంలో ఐదుగురు మహిళల వద్ద భారీగా మద్యం పట్టుబడింది. మద్య సీసాలను పోలీసులు సీజ్ చేసి ముద్దాయిలను అరెస్టు చేశారు. శ్రీశైల పుణ్యక్షేత్రంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆత్మకూరు డిఎస్పీ ఉత్తర్వుల మేరకు శ్రీశైలం సిఐ గంగనాథ్ బాబు ఆధ్వర్యంలో ఎస్సై సుబ్బారెడ్డి, సిబ్బంది కలిసి శ్రీశైలం పరిసర ప్రాంతాలైన రామయ్య టర్నింగ్, టోల్గేట్, టూరిస్ట్ బస్టాండ్లో ఐదుగురు మహిళల ముద్దాయిల వద్ద ఉన్న 24 లీటర్ల సారాయి, 314 డీపీఎల్ 180 ఎం.ఎల్ బాటిల్స్ ను సీజ్ చేసి ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారిని ఆత్మకూరు కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా శ్రీశైలం సీఐ గంగనాద బాబు మాట్లాడుతూ . శ్రీశైలం పవిత్ర క్షేత్రంలో దేవాదాయ చట్టానికి విరుద్ధంగా అమ్మడం నిషేధం అన్నారు. శ్రీశైలంలో మాంసము, బీడీ, సిగరెట్లు అమ్మిన ఎంతటి వారిపైనా అయిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుణ్యక్షేత్రంలో ఇలాంటి నిషిద్ద మైన వాటిపై చాలా కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే పీడి యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామన్నారు. పట్టుబడినవారు ఆత్మకూరు నుండి మద్యం తెచ్చుకొని శ్రీశైలంలో అమ్ముతున్నట్టు తెలిపారు. ఆత్మకూరు నుండి (4) ఆదిలక్ష్మి, అశ్విని, హేమలత, మంగమ్మ, సుశీలమ్మ దోర్నాల నుండి ఒక మహిళ ఉన్నారని తెలిపారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

**హైదరాబాద్,ఏప్రిల్14(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతోంది. ఉదయం 9 దాటితే బయటకు రావడం కష్టంగా మారింది. ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. ఎండదెబ్బ ప్రమాదమని.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. అలాగే, ఉపాధి హామీ కార్మికులకు ప్రత్యేక సూచనలు చేశారు. పనిస్థలాల్లో తాగునీటి వసతి ఏర్పాటు తప్పనిసరని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పని చేసే ప్రాంతాల్లో ఆయా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

# జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం

●షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధికి కృషి

●ఎపి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం చేస్తోందని ఎపి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధి చెందబోతోందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా ఏపీ నిలవనుందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను రూ.288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధిచేశామని మంత్రి తెలిపారు. హార్బర్ నిర్మాణం ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాల జీవితాలు సమూలంగా మారబోతున్నాయని మంత్రి అనగాని అన్నారు. 1,250 మెకనైజ్డ్, మోటరైజ్డ్ చేపల పడవలను సురక్షితంగా నిలిపేలా సదుపాయం కల్పించామన్నారు. కానీ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న మాజీ సీఎం జగన్ రెడ్డి జువ్వలదిన్నెపై విషం కక్కుతున్నారంటూ విరుచుకుపడ్డారు. జగన్ రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉండి.. ఒక్క హార్బర్‌ను గానీ, ఒక్క పోర్టును గానీ పూర్తి చేయలేక పోయారని అన్నారు. జువ్వలదిన్నె హార్బర్, రామాయపట్నం పోర్టులకు పట్టిన గ్రహణం జగన్ రెడ్డి అంటూ వ్యాఖ్యానించారు. గన్ ఆర్థిక ప్రయోజనాల కోసం తీరంలో కొత్త పోర్టులు, హార్బర్లు రాకుండా గతంలో మాజీ సీఎం వైఎస్సార్ జీవోలు ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ చర్యలతో జువ్వలదిన్నె హార్బర్‌తో పాటు రామాయపట్నం పోర్టులో కదలికవచ్చిందన్నారు. 2019 మార్చి 7న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు రూ. 288 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక టెండర్లు ఇచ్చి డబ్బులు తిన్నారే తప్ప జువ్వలదిన్నె హార్బర్ నిర్మాణం పట్టించుకోలేదని ఆరోపించారు. 15వ తేదీన ఏం చెప్పడానికి జగన్ జువ్వలదిన్నె వస్తున్నారని ప్రశ్నించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి వాడరేవు వరకు తీరంలో ఏ నిర్మాణం చేపట్టకుండా తండ్రి అధికారంతో జీఓ తెచ్చానని చెబుతారా అంటూ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఎపి పోలీస్ శాఖ కీలక నిర్ణయం

పెళ్లిళ్లు, పేరంటాలకు సెలవులు

జిల్లా ఎస్పీలకు లేఖలు రాసిన డిజిపి

**అమరావతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పండగలకు, పబ్బాలకు కుటుంబాలతో గడపలేక తీవ్ర ఒత్తిడితో పనిచేసే పోలీసు సిబ్బందికి ఊరటనిచ్చేలా ఎపి డిజిపి కార్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పుట్టినరోజు, పెళ్లి వేడుకలు వంటి ప్రత్యేక సెలవులను మంజూరు చేయాలని డిజిపి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని ర్యాంకుల వారికి ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేస్తూ ,. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా అన్ని జిల్లాల ఎస్పీలకు, పోలీస్ విభాగాల అధిపతులకు ఆదేశాలు పంపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తప్ప, సిబ్బంది కోరిన వెంటనే ఈ ప్రత్యేక సెలవును మంజూరు చేయాలని ఆయన స్పష్టంగా సూచించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, సెలవు మంజూరు చేయడం తప్పనిసరి అని ఆదేశాల్లో పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు తమ కుటుంబ సభ్యులతో గడిపే సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వారి జీవితంలో ముఖ్యమైన ఈ రెండు రోజుల్లోనైనా కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రత్యేక సెలవుల ద్వారా సిబ్బంది మానసికంగా ఉల్లాసం పొంది, విధుల్లో మరింత ఉత్సాహంగా పాల్గొంటారని ఉన్నతాధికారులు ఆశిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ?. మరోవైపు పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ప్రతిపాదనలకు సంబంధించి ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు కొనసాగుతున్న ఫిజికల్ (మాన్యువల్) పద్ధతిలో పెన్షన్ ప్రతిపాదనలను సమర్పించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం కల్పించారు. మే 1వ తేదీ నుంచి రిటైర్డ్ ఉద్యోగులు తప్పనిసరిగా 'నిధి' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే తమ దరఖాస్తులను సమర్పించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూశ్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మహిళా బిల్లు, డి లిమిటేషన్‌పై 16న చర్చ

బిల్లుపై ఎంపిలకు సమాచారం

**న్యూఢిల్లీ,ఏప్రిల్14(ఆర్ఎన్ఎ):** దేశంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న వీటిని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారమిస్తూ.. సంబంధిత ప్రతులను వారికి పంపింది. నూతన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెరగనుండగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలకు పెరిగే అవకాశముంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని సమాచారం. లోక్‌సభలో దీనికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందాక కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి, సీట్ల పెంపు పక్రియను పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలుచేసే దిశగా భావిస్తున్నట్టు తెలుస్తోంది.

## మొదటి పేజీ తరువాయి

# క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా అమరావతి



చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్‌ను సిఎం చంద్రబాబు ఆవిష్కరించారు. మంగళవారం అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీ, గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను ఎస్ఆర్ఎం వర్సిటీ నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారు. 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను సీఎం జాతికి అంకితం చేశారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. దీనికి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహకారం అందించింది. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సభ్యులు సహా ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగ శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరయ్యారు. ఎపిలోని వివిధ వర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్‌గా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. టెక్నాలజీని అర్థం చేసుకుని ప్రోత్సహించే నాయకత్వం దేశానికి అవసరమని, ఆ దిశగా ప్రధాని నరేంద్ర మోడీ సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉండటం దేశానికి అదృష్టమని వ్యాఖ్యానించారు. అమరావతి క్వాంటం వ్యాలీ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కేవలం ఎనిమిది నెలల్లోనే ఈ క్వాంటం ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ..క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తిగా మారనుందని అన్నారు. పారిశ్రామిక రంగానికి విద్యుత్ ఎంత ముఖ్యమో, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ ఎంత అవసరమో, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ కూడా అంతే కీలకమని వివరించారు. ఈ రంగంలో ముందంజలో ఉన్న దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశముందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా స్వదేశీ తయారీ క్వాంటం కంప్యూటర్ దేశానికి గర్వకారణమని, అమరావతి క్వాంటం వ్యాలీ రాష్ట్రానికే కాకుండా దేశానికీ ప్రతిష్ఠను తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు క్వాంటం టెస్ట్ బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టి÷ చేయడానికి కీలక వేదికలుగా నిలవనున్నాయి. పరిశోధకులు, విద్యార్థులు, కంపెనీలు క్వాంటం టెక్నాలజీని వినియోగించుకునేలా వీటి ద్వారా అవకాశాలు విస్తరించనున్నాయి. క్వాంటం సైన్స్‌కు వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం గర్వకారణమని సీఎం అన్నారు.

# ఇకపై లోక్‌సభలో 850 స్థానాలు..?

ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం.

**సమావేశం కానున్న ఇండియా కూటమి..**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై బుధవారం ఇండియా కూటమి నేతలు భేటీకానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై సమాచారం అందిన నేపథ్యంలో.. వాటిపై చర్చించనున్నారు.

# రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా వైకాపా ఉన్మాదం

పోయి.. గుడ్డిగా అనుసరిస్తారా? అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే వైకాపా పనిగా పెట్టుకుంది. రాష్ట్రంలో వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది. వైకాపా హయాంలో అరాచక పాలన సాగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. అభివృద్ధి కంటే.. విధ్వంసానికి ప్రాధాన్యత ఇచ్చిందని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తూ, ఆర్థికంగా దివాలా తీయించారు. మహిళలపై అసభ్యకర పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందారు. మహిళలపై దాడులు జరుగుతున్నా, ఫిర్యాదులు అందుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం వారి బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట. వైసీపీ అరాచకాలను భరించలేక ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అన్నారు.

# సౌరశక్తితో విద్యుత్ ఆదా

ప్రసంగాలు అందరికీ అర్థమయ్యేలా స్పష్టంగా ఉంటాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొనియాడారు. గత ప్రభుత్వంలో దుర్వినియోగమైన ఎస్సీ సబ్ ఎ÷–లాన్ నిధులను ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం.. దళితవాడల అభివృద్ధికి వినియోగిస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అమాయక గిరిజనులు ఈ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. నేరగాళ్లు, రౌడీ మూకలపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, ఎన్డీపీఎస్ చట్టాన్ని మరింత కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఆరు నెలల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో గంజాయి రవాణా, రౌడీయిజాన్ని పూర్తిగా అణచివేస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు. గంజాయి రవాణా పై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. ఆరు నెలల్లో పూర్తిగా నిర్మూలిస్తామని పేర్కొన్నారు. అలాగే వీధి రౌడీలను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# నారీశక్తికి మద్దతు ఇవ్వండి

అధ్యక్షులు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావు తదితర నాయకులకు ముఖ్యమంత్రి లేఖలు పంపారు. మహిళలకు పార్లమెంట్, విధాన సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని బలపరుద్దామని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ఈ నెల 16వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టమని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. 'నారీ శక్తి వందన్ అధినియం' మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వంలో, పరిపాలనలో, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని నమ్ముతున్నట్లు వ్యాఖ్యానించారు. భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలుకుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

# నాతవరంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాతవరం, గొలుగొండ, కేడీ పేట ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను నేతలు ప్రారంభించారు. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీ సోలరైజేషన్ పక్రియను స్పీకర్, హోంమంత్రి ప్రారంభించారు. హోం మంత్రిగా ఎలా ఉండాలో అనిత నిరూపించారని, అసెంబ్లీలో కూడా ఆమె ప్రసంగాలు అందరికీ అర్థమయ్యేలా స్పష్టంగా ఉంటాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొనియాడారు.

అయ్యన్నపాత్రుడు తన రాజకీయ గురువని, ఆయన ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి చేరానని హోం మంత్రి వంగలపూడి అనిత భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. సభాపతి అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో రాజధాని అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడం చారిత్రాత్మకమని తెలిపారు. గత ప్రభుత్వంలో దుర్వినియోగమైన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం.. దళితవాడల అభివృద్ధికి వినియోగిస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గం నేటికీ సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఉక్కిరి.. బిక్కిరి..!

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ముక్కంటి ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులను ప్రవేశ గోపురాల వద్ద పుస్తక విక్రయాలతో కొందరు బాలికలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. చదువుకోవాల్సిన వయసులో వీరు పుస్తకాలు చేత పట్టుకుని భక్తులను చుట్టుముట్టేస్తున్నారు. ప్రశాంతంగా దర్శనం కోసం వచ్చే భక్తులు వీరి నిర్వాకంతో ఒకింత అసహనానికి గురవుతున్నారు.

## ఐపీఎల్ బెట్టింగ్ జోలికి వెళ్లొద్దు: సీఐ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): యువత ఐపీఎల్ బెట్టింగ్ జోలికి వెళ్లొద్దని శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ ప్రకాష్ కుమార్ అన్నారు. మీడియా తో మాట్లాడుతూ క్రికెట్ సీజన్ పేరిట నిర్వహించే ఆన్లైన్ బెట్టింగ్ వల్ల డబ్బులు కోల్పోవడమే కాకుండా, క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. క్రీడలను వినోదంగా చూడాలి తప్ప, వ్యసనంగా మార్చుకోవద్దన్నారు. గ్రామాల్లో ఐపీఎల్ మ్యాచ్లను డబ్బులు పెట్టి మ్యాచ్ గెలుపు ఓటమి వద్ద బెట్టింగ్ పెడితే తగు చర్యలు ఉంటాయన్నారు. ఎవరైనా యువకులు ఆన్లైన్ బెట్టింగ్ ఆడినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బెట్టింగ్ నిర్వహించినట్లు తెలిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని అన్ని లాడ్జిల్లో నిఘా ఉంచామని ఆయన తెలిపారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళి : కోలా ఆనంద్



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రాజ్యాంగ నిర్మాత, ఆధునిక భారత శిల్పి, డాక్టరు బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను బీజేపీ ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్ టి సి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ పేద, బడుగు బలహీనవర్గాల శ్రేయస్సు, మహిళ హక్కుల కోసం, దేశ అభివృద్ధి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను అమలు చేయడంలో ప్రస్తుతం ప్రధాన మంత్రి "మోదీ సర్కారు" ఎనలేని కృషి చేస్తోందన్నారు. అంబేద్కర్ ఆశయాలు వర్ధిల్లాలి" అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం.. అని నినాదాలు చేస్తూ.. అంబేద్కర్ అడుగుజాడల్లో యువత పయనించాలని కోలా ఆనంద్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతరకు ఎమ్మెల్యేకి ఆహ్వానం



నాయుడుపేట ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మే నెల 5,6 తేదీల్లో జరుగునున్న నాయుడుపేట గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహించి, అమ్మవారి ఆశీర్వాదాలు అందుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి ఆహ్వాన పత్రం అందజేశారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమెను పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు కలిశారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జాతరను వైభవంగా నిర్వహించాలని వారు కోరారు. అనంతరం ఆలయ మర్యాదలతో తాంబూలంతో కలిపి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నిత్యా కృష్ణారెడ్డి , వినుకొండ ధనంజయ, ఆబోతుల బాబు, సురేష్, బాలు శెట్టి, హైమావతి, ఆలయ పూజారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఘన నివాళి

అనంతపురం, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): అనంతపురం పి వి కే ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బంది అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. కళాశాల లోని ప్రత్యేక ఛాంబర్ లో ఏర్పాటుచేసిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి , పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అపూర్వమైన సేవలు అందించారు. సమాజంలో సమానత్వం, న్యాయం నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. పల్లె వెంకట్ కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ... అంబేద్కర్ ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి

### -ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



తిరుపతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. కార్యాలయంలో మంగళవారం అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సిఎండి మాట్లాడుతూ బి.ఆర్.అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అత్యున్నత రాజ్యాంగంగా నిలిచిందని కొనియాడారు. సమాజంలో దళిత వర్గంలో డిగ్రీ పాసైన మొదటి వ్యక్తిగా అంబేద్కర్ కావడం, ఆయన 32 డిగ్రీలను పొందడం గొప్ప విషయం అన్నారు. మహిళలు నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఉద్యోగులందరూ ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను మంగళవారం 600 మంది సందర్శించారు. ఛాయాచిత్ర మాలికను సందర్శించిన సంస్థ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఎగ్జిబిషన్ ను బుధవారం సాయంత్రం వరకు కొనసాగించనున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు సిహెచ్ రామచంద్ర రావు, కె. ఆదిశేషయ్య, జె.రమణా దేవి, యం. మురళీ కుమార్, యం.ఉమాపతి, కె. సంపత్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కే. జనార్దన్ నాయుడు, జనరల్ మేనేజర్లు ప్రసాద్, సురేంద్ర రావు, శ్రీకాంత్, జగదీష్, భాస్కర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఈ సివిల్ డి. తిరుమల రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కార్మికులకు దుస్తుల వితరణ**

ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎపిఎస్ఇబి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి చేతుల మీదుగా కార్పొరేట్ కార్యాలయంలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జయరామ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

**చలివేంద్రం ప్రారంభం**

వేసవి నేపథ్యంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ప్రారంభించారు. పాదచారుల కోసం ఉదయం చల్లటి తాగునీటితోపాటు మజ్జిగను అందుబాటులో ఉంచనున్నట్లు తెలియజేశారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



రామచంద్రపురం, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మండలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళ వారం అన్ని ప్రభుత్వ, గ్రామపంచాయతీ కార్యాలయాలలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని అనుపల్లి పంచాయతీ నూతుగుంటపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ బిందు మాధవి, దళిత నాయకులు, కూటమి నాయకులు భారీ కేక్ కట్ చేసి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ సి పురం కూడలి వద్ద దళిత సంఘాల నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. రక్షకబట నిలయంలో సబ్ ఇన్ స్పెక్టర్ భక్తవత్సలం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి అంబేద్కర్ జయంతోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, తేజోవతి, ఎంఈఓ మార్కండేయ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, హెడ్ కానిస్టేబులు ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది సి మహేష్ హేమ్లాల్ భాషా, రఘు, దివ్య, టిడిపి నాయకులు వెంకటేష్ నాయుడు, బండి విజయ్ కుమార్ రెడ్డి, యారం.జోహార్ రాయల్ దళిత సంఘ నాయకులు జి సుధాకర్, నెల్లేపల్లి వెంకటేష్, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాల రేపే గృహప్రవేశం

తొట్టంబేడు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన దిశగా కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన టిడ్కో గృహాలు రేపు లబ్ధిదారులకు ఇచ్చే విధంగా శ్రీకాళహస్తిలో కార్యాచరణ చేపట్టారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్ భవాని ప్రసాద్ , తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ సంయుక్తంగా టిడ్కో గృహాల సముదాయాలను మంగళవారం పరిశీలించారు. పనులు పూర్తి కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం లబ్ధిదారులకు అన్ని వసతులతో కూడిన గృహాలను అందజేసే విధంగా కార్యాచరణ చేపట్టారు, ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. ప్రభుత్వం పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా చేపట్టిన టిడ్కో గృహాలను, రేపు శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో 1648 గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. అన్ని వసతులతో కూడిన గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు.

శ్రీకాళహస్తి తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ.. రేపు శ్రీకాళహస్తి పట్టణంలోని శివనాద పాల్యం వద్ద ఏర్పాటుచేసిన టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అందజేసే విధంగా కార్యాచరణ చేపట్టామన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.. తమ సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే రేపు టిడ్కో గృహ సముదాయంలో ఇంటిని ఇవ్వడం సంతోషంగా వుందన్నారు. తమకు సొంతింటిని ఇచ్చిన తెలుగుదేశం ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలియజేశారు..


## అంబేద్కర్‌కి ఘన నివాళి

సత్యవేడు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): సత్యవేడు కె వి బి పురం. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల అధ్యక్షులు మునస్వామి యాదవ్ నివాళలర్పించారు. కె వి బి సెంటర్లో ఆయన జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మునస్వామి యాదవ్ మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం అందించడంలో అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మునస్వామి యాదవ్, జనసేనా నాయుకులు లావణ్య కుమార్, బాలు చిన్న,హరి, చంద్ర, పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొని అంబేద్కర్‌కి నివాళులు అర్పించారు.

## అమ్మ అనాధ మహిళ వృద్ధాశ్రమంలో వసంతోత్సవ వేడుకలు




తొట్టంబేడు,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): తొట్టంబేడు మండలం అమ్మ అనాధ మహిళా వృద్ధాశ్రమంలో వసంతోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుఖ బ్రహ్మాశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు అమ్మ విగ్రహానికి పూజ నిర్వహణతో కార్యక్రమం ప్రారంభమైనది. ఈ కార్యక్రమం ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు భూలక్ష్మి అధ్యక్షతన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూజతో నివాళులర్పిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సరోజమ్మ, సరస్వతమ్మల పర్యవేక్షణలో ఈ రజతోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు. ఈ పాతికేళ్ల సేవా ప్రస్థానంలో ఎదుర్కొన్న ఒడిదుడుకుల గురించి ఎలా లక్ష్యం సాధించారో పి.భూలక్ష్మి మేడం వివరించారు. ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ అనాధ మహిళ వృద్ధులకు చేసిన సేవను కొనియాడారు. ఆశ్రమానికి మూల స్తంభాలైన అక్కా చెల్లెళ్ళు సరోజమ్మ, సరస్వతమ్మ, భూలక్ష్మి లను ప్రశంసించారు. చిన్నారి రూపచందన నృత్య ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను దుస్సాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ. డా.సిపాయి సుబ్రహ్మణ్యం , శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ , బిజెపి నాయకురాలు కంద్రిగ ఉమ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాగీ క్లారా , మాజీ పాలకమండలి సభ్యురాలు ప్రమీలమ్మ , గౌరవ సలహాదారు జయంతి జయకర్, చెన్నై ప్రముఖ చిత్రకారులు కె.దామోదరాచారి చంద్రబాబు, న్యాయవాది రాజేశ్వరరావు, యోగ మాస్టర్ కిరణ్ కుమార్, అమ్మ ఆశ్రమం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లా

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### - ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్ కూటమి నాయకులు కాసరం రమేష్, పేట బాలాజీరెడ్డి,గోపీనాథ్, మేళా గారశీ సుబ్రహ్మణ్యం రెడ్డి, చంద్ర, సన్నీ, భాస్కరయ్య, రమేష్, మనీ,రామ్మూర్తి, రాంబాబు, పులి శ్రీకాంత్, చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శతచండీ పారాయణ సహిత చండీ మహాయజ్ఞం అంకురార్పణ



రామచంద్రాపురం, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రామచంద్రాపురం మండలం రాయల చెరువు పంచాయతీ చాయా పురంలో వెలిసిన శ్రీ శనీశ్వర స్వామి ఆలయ ఆవరణంలో శ్రీ మహా మండలేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా మంగళవారం ఉదయం మహాగణపతి హోమం, గోపూజతో 40 మంది శ్రీ చండీ ఉపాసకులచే శ్రీ శత చండీ పారాయణ సహిత చండీ మహా యజ్ఞము అంకురార్పణ జరిగింది. అనంతరం క్షేత్ర మూల దైవం శ్రీ శనీశ్వర స్వామివారికి, క్షేత్ర పాలకులు శ్రీ అభయస్థ ఆంజనేయ స్వామి వారికి ప్రాకారోత్సవాన్ని ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రహ్మణ్యం శర్మ భక్తులతో కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీరామ జపం ఆంజనేయ స్వామి జపంతో భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవంలో పాల్గొన్నారు. ఉభయ దాతలకు అర్చకులు శని దోష నివారణ హోమం, నవగ్రహ దోష నివారణ, గణపతి హోమాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మాధికారి మాట్లాడుతూ మూడు రోజులపాటు శ్రీ శతచండీ పారాయణ సహిత చండీ మహా యజ్ఞం సంకల్పించడానికి కారణం లోక కళ్యాణార్థం, ప్రజల కుటుంబాల సౌఖ్యం, సమృద్ధి సుఖం సకల జీవుల సౌలభ్యం కొరకు చేస్తున్న మహా యజ్ఞం అని తెలిపారు. ఆలయ చిత్ర దైవమైన శ్రీ శనీశ్వర స్వామి వారికి తైలాభిషేకం, నవగ్రహ పూజలు, నవగ్రహ నివారణ హోమాలు చేయడం వల్ల ప్రతి ఒక్కరికి శాంతి, సుఖం, మంచి జీవితం ప్రాప్తిస్తుందని తెలిపారు. ఈ మూడు రోజులు మహా శివ క్షేత్రాల నుంచి వచ్చిన 40 మంది చండీ ఉపాసకులచే శత చండి పారాయణ సహిత మహాయుగంలో భక్తులందరూ పాల్గొని పూర్వజన్మ పాపాలను, దోషాల నుంచి విముక్తి పొందాలని తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరించాయి. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ అవకతవకల ఫిర్యాదులపై విచారించండి

### - పిఆర్ ఏడి ఆదేశించిన కలెక్టర్
### - జర్నలిజాన్ని నమ్ముకున్న తమకు న్యాయం చేయాలని కోరిన సీనియర్ జర్నలిస్టులు

అనంతపురం,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): అనంతపురం జిల్లా అక్రిడిటేషన్ల మంజూరు లో జరిగిన అవకతవకల ఫిర్యాదు పై కలెక్టర్ ఆనంద్ స్పందించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సమాచార శాఖ ఏడిని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల దినోత్సవం లో అనేక దశాబ్దాలుగా జర్నలిజాన్నే నమ్ముకున్న తమకు న్యాయం చేయాలని సీనియర్ జర్నలిస్టు భాస్కర్ రెడ్డి, రమేష్ రెడ్డి, షేక్ బికారి, పరంధామ, త్యాగరాజు, రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు వినతిపత్రం ఇచ్చుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల మేరకే అర్హులైన వారికి అక్రిడి టేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులను తొలగించాలని ఏడిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలపై సమాచార శాఖ అధికారి స్పందిస్తూ తప్పకుండా సీనియర్ పాత్రికేయులు ఇచ్చిన ఫిర్యాదు పై విచారణ నిర్వహిస్తామన్నారు.

**నమ్ముకున్నాం..న్యాయం చేయండి**

ఎన్నో ఏళ్ళుగా జర్నలిజం వృత్తినే జీవనాధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్నాం.. మాకు మరో దారి లేదు. ఇలాంటి పరిస్థితులలో మానవతా దృక్పథంతో కొన్ని ప్రభుత్వ నిబంధనలను సడలింపు చేసైనా అక్రిడిటేషన్ల మంజూరులో తమకు న్యాయం చేయాలని సీనియర్ పాత్రికేయులు కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. కొత్తగా మంజూరు చేసిన అక్రిడిటేషన్ల జారీలో పలు అనుమానాలకి దారి తీస్తుందని కలెక్టర్ కు వివరించారు. తమకు జరిగిన అన్యాయంపై సానుకూల నిర్ణయం తీసుకోవడంతో పాటు మంజూరైన అక్రిడిటేషన్ల వ్యవహారాన్ని మరోమారు క్షుణ్ణంగా విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ అక్రమాలు అవకతవకలపై సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు నిష్పాక్షికంగా విచారణ నిర్వహిస్తే అక్రమంగా అక్రిడిటేషన్ల పొందిన వారి బండారం బయటపడే అవకాశం ఉందన్నారు.

## పేదల ఆకలి తీర్చడమే అంబేద్కర్‌కు అసలైన నివాళి

### - ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): నాయుడుపేట పట్టణంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రభంజనంలా సాగాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని, భారీ జనసందోహం నడుమ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేద్కర్ కన్న కలలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజం చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని 12,638 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సోలార్ ప్యానెల్స్ ద్వారా ఉచిత విద్యుత్ అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని పేదలకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పెళ్లకూరు మండల చైర్మన్ సంచి కృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు రఫీ, కట్టా రమణారెడ్డి, ఎస్కే రాజేష్, పసల గంగప్రసాద్, న్యాయవాది చంగయ్య, అవధానం సురేష్, చెంబేటి సుజాత మరియు భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళి

### - నాయుడుపేటలో మిన్నంటిన బామ్ సెఫ్ సామాజిక సేవా స్ఫూర్తి
### - బామ్ సెఫ్ జిల్లా ఇంచార్జ్ రమేష్

నాయుడుపేట,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి): నాయుడుపేట. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నాయుడుపేటలో బామ్ సెఫ్ , మూల్ నివాసి సంఘ సంయుక్త ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించబడింది. బాబాసాహెబ్ కన్న కలలను సాకారం చేసే క్రమంలో సమాజ సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు బామ్ సెఫ్ జిల్లా ఇంచార్జ్ టి.రమేష్ మరియు మూల్ నివాసి జిల్లా ఇంచార్జ్ చెంచురత్నం మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతిని కేవలం ఉత్సవంగానే కాకుండా, తోటి మనిషి ప్రాణాన్ని కాపాడే రక్తదాన కార్యక్రమంతో జరుపుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన పడిన తపనను స్మరిస్తూ, సామాజిక బాధ్యతగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ ఎస్ఎస్సి మెంబర్ వరప్రసాద్, ప్రముఖులు ఆమవరపు మురళీకృష్ణ, ఆమవరపు సత్యం, ఆమవరపు సురేంద్ర మరియు డాక్టర్ కల్లూరు గురవయ్య తదితరులు పాల్గొన్నారు. యువత మరియు బామ్ సెఫ్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.

# అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



**పలమనేరు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఏప్రిల్ 14 నుండి 20 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడుతున్న "అగ్నిమాపక వారోత్సవాల". రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఉత్తర్వుల మేరకు, అగ్నిమాపక అధికారి సి. పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో జరుగు తున్నాయి. ఈ ఏడాది నినాదం: "సురక్షిత పాఠశాలలు, సురక్షితమైన ఆసుపత్రులు, అగ్ని మాపక భద్రతపై స్పృహ ఉన్న సమాజం మంటలను నివారించడానికి కలిసి పనిచేస్తాయి. ఈ కార్యక్రమానికి పలమనేరు అర్బన్ సిఐ కె.మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సిబ్బంది గౌరవ వందనం స్వీకరించినారు. కార్యక్రమంలో పి.మనోగరన్, అగ్నిమాపక కేంద్రాధికారి, కె. మోహన్ రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి



**పలమనేరు,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు రూరల్ మండలంలోని కొలమాసనపల్లి గ్రామంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు మంజుల రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లిపట్ల రోడ్డు కూడలి వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బేలుపల్లి క్రాస్ నుండి గొల్లపల్లి వరకూ అంబేద్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్ర మంలో మండల ప్రధాన కార్యదర్శి గణేష్, మాజీ సర్పంచ్లు సెల్వరాజ్, హేమ సుందరం, శేఖర్, నరేష్ రెడ్డి, జగదీష్, వినోద్, వెంకటేష్, దేవేంద్ర, సునీల్, దయ, రేవంత్, మునిరత్నం, బాబు, గుణ పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- ఎమ్మెల్యే అమర్**



**పలమనేరు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు పలమనేరులో మంగళవారం ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ విభాగ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. పద్మశ్రీ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజు, నాయకులు కుట్టి,గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, చిన్ని, ఖాజా, బిఆర్సి కుమార్, పర్వీన్, చిన్ని, పలమనేరు మండల నాయకులు నాగరాజు రెడ్డి, వెంకటముని రెడ్డి, గంగవరం నాయకులు సోమశేఖర్ గౌడ్, పల్లెరుచులు అమరనాథ రెడ్డి, రవి,గిరిధర్ గోపాల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరులో అంబేద్కర్ జయంతి వేడుకలు



**పుంగనూరు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక సంస్కర్త, విద్యావేత్త , ఆర్థిక నిపుణుడు అయిన అంబేద్కర్ జయంతిని పుంగనూరు బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ సి మోర్చా నాయకులు బి నరసింహులు,సీనియర్ నాయకులు నానా బాల కుమార్,మైనారిటీ నాయకులు అయూబ్ ఖాన్ పట్టణంలోని కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ, సమసమాజ స్థాపనకు కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

## అంబేద్కర్ ఆశయాలు స్ఫూర్తిగా తీసుకుందాం

**- ఎస్పీ పి.జగదీష్**

**అనంతపురం, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బీ.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి పి. జగదీష్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఆర్ ఐ పవన్ కుమార్ , రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ, ఆర్ ఎస్ ఐ లు బాబ్జాన్, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి లక్ష్యం

**- కలెక్టర్ సుమిత్ కుమార్**


**రామకుప్పం,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ చెప్పిన విధంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపాలన సాగిస్తున్నారని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం సమీపంలో గల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అంబేద్కర్ 115 వ జయంతి కార్యక్రమం , ఎం జి వి కే ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ వారిచే పి-4 కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాలను దత్తత తీసుకునే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వినూత్నంగా ఆలోచనచేసి అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజలను ఉన్నత స్థానాలకు తీసుకొచ్చి ఆర్థికంగా ఎదగడానికి సహాయంచేసే పి ఫోర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీంతో కుప్పం నియోజకవర్గమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు బాగుపడడానికి ఈ కార్యక్రమం నిలుస్తుందని పేర్కొన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎంజీవికే భాను మాట్లాడుతూ కేవలం సి ఎస్ ఆర్ నిధులు ద్వారా కళాశాలలో భవనాలు నిర్మించి ఇతర మౌలిక సదుపాయాలు కల్పనే కాక విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి , క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని లక్ష్యంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాదరావు , కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ , ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ , రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు మునిరత్నం , పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ వి జీ ప్రతాప్, కుప్పం ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి , జనసేన నియోజకవర్గం ఇంచార్జి నరేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామ్రాజ్ నాయక్, మాజీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి ,స్థానిక తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, సీతాపతి, రామమూర్తి , నరసింహులు, విశ్వనాథ్, విజయకుమార్ రెడ్డి,రఘు, బాలకృష్ణ, అవినాష్ రెడ్డి, అల్లిశ్రీను, జై ఈ,భాస్కర్ , జనసేన మండల అధ్యక్షుడు హరీష్ , కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలలో మాజీ ఎమ్మెల్యే



**పలమనేరు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని పద్మశ్రీ సర్కిల్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపి నాయకులు మాట్లాడుతూ విద్యతోనే విముక్తి సాధ్యమని ప్రపంచానికి చాటిచెప్పిన మహర్షి, సమాన హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. కార్యక్రమం లో బాలాజీ నాయుడు, కేశవులు, నాగరాజ్, ప్రహల్లాద, చంద్రన్న, రఘునాథ్, కమల్, సోమచంద్రారెడ్డి, రవి, గిరి రాజారెడ్డి, కోదండరామయ్య, ముజ్జు, గోవిందస్వామి, రోజా, వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చౌడేపల్లిలో అంబేద్కర్ జయంతి



**చౌడేపల్లి,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రమైన చౌడేపల్లిలో అంబేద్కర్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. మండల వ్యాప్తంగా ప్రజలు సామాజిక వర్గ విభేదాలు లేకుండా ఒక వేదికపై జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. తొలుత అంబేద్కర్ భవనంలో ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ట్రాక్టర్పై పుష్పాలతో, విద్యుత్ దీపాలంకరణతో అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్లో మానహారం, భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మహిళల కోలాటలు, డప్పుల కోలాహలంతో ప్రజా సంఘాలు, దళితుల సంఘాలు మిళితమై నిర్వహించిన, ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం : రమేష్ రెడ్డి



**చౌడేపల్లి,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాం గ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరిం చుకొని స్థానిక మండల పరిపాలన భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సమసమాజ స్థాపనకు అహర్నిశలు అంబేద్కర్ కృషి చేశారని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించి ప్రపంచ మేధావిగా గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జై భీమ్ నినాదంతో మండల పరిపాలన భవనం మారుమోగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి!

**అనంతపురం,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలు అంటూ ప్రజలను నమ్మబలికి అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం వైఫ్యలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైయస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భం గా ఇటీవల పార్టీ పదవులు దక్కిన పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు. వైయస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ యాదవ్, రజక విభాగం జిల్లా అధ్యక్షులు నారాయణస్వామి, పబ్లిసిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ట్రేడ్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పూలమాలలు వేసి, శ్యాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. సమష్టిగా పని చేస్తూ పార్టీను బలోపేతం చేయడంతో పాటు రాబోవు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కూటమి పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడాను ప్రజలలోకి తీసుకువెళ్లాలని సూచించారు.



# చిత్తూరు జిల్లా

## చదువుకుంటే సమాజంలో గౌరవం

**- ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు**



**చిత్తూరు,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని రూపొందించిన ఘనత బాబాసాహెబ్ అంబేద్కర్కే దక్కుతుందని, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. భారతరత్న అంబేద్కర్ 135 వ జయంతి మహోత్సవం వేడుకలు సందర్భంగా మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనములో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చూడ చైర్మన్ కటారి హేమలత, మాల కార్పొరేషన్ డైరెక్టర్లు యుగంధర్, డాక్టర్ బాబు, ఎస్సీ , ఎస్టీ, మానిటరింగ్ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంబేద్కర్ కారణంగానే ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన దేశంగా మన భారతదేశం రూపొందిందని పేర్కొన్నారు. పౌరులందరూ ఉన్నత స్థానాల్లో ఉండాలన్నదే అంబేద్కర్ ఆశయమని చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. మనమంతా అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలన్నారు. అంబేద్కర్ చిన్నప్పటి నుండి ఎన్నో కష్టాలను, అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ, కష్టపడి చదువుకోవడం ద్వారా ప్రపంచం గర్వించే విధంగా అత్యున్నత స్థాయికి ఎదిగారన్నారు. రాజ్యాంగ రచనా సమయంలో ఆయన అధ్యయనం చేసి మన దేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. 75 ఏళ్ల క్రితమే ఆయన భవిష్యత్తును ఆలోచించి, రాజ్యాంగాన్ని రచించడం ఆయన దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యే మాట్లాడుతూ.... సమానత్వం, న్యాయం, స్వేచ్ఛల కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు అంబేద్కర్ మనకు మార్గదర్శి అన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ సమావేశం లో మాల కార్పొరేషన్ డైరెక్టర్లు, డివియంసి సభ్యులు, షెడ్యూల్ కులాల సంఘాల నాయకులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత ఘట్టాలు, ఆయన బడుగు బలహీన వర్గాలకు, దేశానికి చేసిన సేవలు గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ జయంతి సందర్భంగా డిఆర్డీఏ ఆధ్వర్యంలో 2025 - 26 సంవత్సరానికి 47 మంది స్వయం సహాయక గ్రూపులకు, ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ ఉన్నతి ద్వారా వడ్డీ లేని రుణాలు సబ్సిడీ రూపంలో రూ 47 లక్షల విలువచేసే చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి శ్రీదేవి, డివిఎంసి సభ్యులు రాజ్ కుమార్, ధనశేఖర్, శంకర్, రవి, షెడ్యూల్ కులాల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి మాఫియా ఆగడాలపై ఎమ్మెల్యే ఆగ్రహం

**- గంటావూరు చెరువులో అక్రమాలపై స్థానికుల ఫిర్యాదు**

**- ఎంతటి వారైనా ఉపేక్షించరాదని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు**



**పలమనేరు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరులో రోజురోజుకు శృతి మించిపోతున్న మట్టి మాఫియా ఆగడాలపై ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలమనేరు మున్సిపల్ పరిధిలోని గంటావూరు చెరువులో మట్టి మాఫియా అక్రమాలపై స్థానికులు ఎమ్మెల్యేను మంగళ వారం కలిసి వినతిపత్రం అందజేశారు. భారీ ఎత్తున మట్టిని తోడేయడంతో పాటు పక్కనున్న స్మశానంలోనూ తవ్వకాలు జరుపుతున్నారని, దీంతో స్మశాన స్థలం కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ మధ్యకాలంలో అక్రమార్కులు జరిపిన తవ్వకాలలో శవాలు సైతం బయటపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే ఇరిగేషన్, పోలీస్ అధికారులకు ఫోన్చేసి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ సీఐ మోహన్ రెడ్డి తన కార్యాలయానికి పిలిపించుకొని.. మట్టి మాఫియా విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఎంతటి వారైనా ఉపేక్షించ వద్దని సీఐకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువును పరిశీలించి సప్లై ఛానల్ ను గుర్తించాలని చెరువు దురాక్రమణ కాకుండా చూడాలన్నారు. మరోవైపు గ్రామస్తులు సైతం మట్టి మాఫియాను అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించి , చెరువును కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యను తీసుకొచ్చిన వెంటనే స్పందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ వి బాలాజీ, ఆర్ బీ సీ కుట్టి, గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్, టెర్రకోట కళాకారుల సంఘం నాయకులు రామకృష్ణ, స్థానికులు దైవప్రసాద్, సారాయి చంద్ర,తో పాటు పలువురు పాల్గొన్నారు.

## చిత్తూరులో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**చిత్తూరు,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మై భారత్ చిత్తూరు' సంస్థ డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఆర్. సహదేవ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత విశేషాలు, ఆలోచనలు, సమాజానికి చేసిన సేవలను గుర్తుచేశారు. యువత ఆయన చూపిన సమానత్వం, న్యాయం, సామాజిక మార్పు మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. మై భారత్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం.సీ. బాబు రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అనంతరం దర్గా సర్కిల్ నుంచి అంబేద్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వారు అంబేద్కర్ ఆశయాలను ప్రతిబింబించే నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జోసెఫ్ రాజు (సపోర్ట్ సంస్థ అధ్యక్షుడు), వాలంటీర్లు, సుమారు 50 మంది యువత పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడాకారునికి ఘన సన్మానం



**రామకుప్పం,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని మారుమూల అటవీ సరిహద్దు ప్రాంతంలో ఒక పేద కుటుంబంలో జన్మించి అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన షూటింగ్ బాల్ టోర్నీలో పథకాన్ని సాధించి భారతదేశం కీర్తి పతాకాన్ని ఎగరవేసిన వీర్నమల గ్రామానికి చెందిన నవీన్ ను బుధవారం రామకుప్పం మండలంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ,కడా ప్రత్యేక అధికారి వికాస్ మరమ్మత్, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు అధికారులు , నేతలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ క్రీడాకారులు ఉన్నారని, వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి చేయూత నిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటడానికి అవకాశం ఉందన్నారు నవీన్ సన్మానించిన వారిలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు పి ఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ విజీ ప్రతాప్, రామకుప్పం ఎస్సై వెంకట్ మోహన్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజు నాయక్, మాజీ మండల అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్ని కృష్ణ, ఎంపీపీ సులోచన గుర్రప్ప, మాజీ రెస్కో డైరెక్టర్ చలపతి, జిల్లా నేత పట్రా నారాయణ, యూనిట్ ఇన్చార్జి సీతాపతి, రామమూర్తి, నాగభూషణం, మనోహర్, గజేంద్ర, రవిరెడ్డి, జై ఈ, రాజారాం, పాండియన్, విజయ్ కుమార్ రెడ్డి అవినాష్ రెడ్డి, బాలకృష్ణ,రవి, అల్లి శ్రీను, దయా,బాలు, ఆదిల్, సుబ్రీ, భాస్కర్, పాల్గొన్నారు.



# బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేద్కర్

## - కలెక్టర్ నిశాంత్ కుమార్

**మదనపల్లె, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బాబాసాహెబ్ అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞా శాలి అని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శేషసాయి కళ్యాణ మండపంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే షాజహాన్ భాష, ఇన్‌చార్జ్ డిఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక వర్గానికి చెందిన నాయకుడిగా చూడడం సరైంది కాదని, ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు సమాజంలోని ప్రతి వర్గానికి మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు మాత్రమే కాకుండా మహిళలు, కార్మికులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విస్తృతమైన హక్కులు లభిస్తున్నాయని తెలిపారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం అంబేద్కర్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. సమాజంలోని ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన రాజ్యాంగం అత్యుత్తమమైన దన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ కృషిని స్మరించుకోవడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ, డిఆర్డిఏ సంయుక్తంగా పీఎం అజయ్ పథకం కింద 25 మంది లబ్ధిదారులకు రూ.27 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ఎం. పర్వీన్ తాజ్, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భావన, మదనపల్లి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ జి.శివరాం, మాల మహానాడు ప్రెసిడెంట్ వై. సుదర్శనం, డివిఎంసి మెంబర్లు పి.శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఎస్. రామకృష్ణ, జి.వెంకటరమణ, బాస్ పి.టి.యం శివప్రసాద్, ఏం.ఆర్.పి.ఎస్.నరేంద్ర, బహుజన సేన శ్రీచందు, ఎస్సీ ఎస్టీ నాయకులు బొజ్జప్ప, దివాకర్, పోతపోలు రెడ్డప్ప, పి.వెంకటరమణ, దళిత సంఘర్షణ సంస్థ చిన్నప్ప, బి.రమణ వివిధ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలి

## - మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్శిటీలో జయంతి



**మదనపల్లె/కురబలకోట, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో మై భారత్ అన్నమయ్య సంస్థ వారి ఆధ్వర్యంలో డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ఎన్.ఎస్.ఎస్ కో - ఆర్డినేటర్ పి.రాజేష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, సామాజికంగా దేశ పురోగతికి మార్గదర్శనం చేసిన మహనీయుడు మన అంబేద్కర్ అని తెలిపారు. ఇప్పటికీ ఆయన రచించిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి అని, ఆయన సూచించిన మార్గాలే పాలకులకు మార్గదర్శకాలని, ఆయన ఆలోచనల నుంచి జాలువారిన నిర్ణయాలు, ప్రతిపాదనలు సమాజ ప్రగతికి సోపానాలుగా నిలిచాయన్నారు. యువత తరాలు ఆయన ఆశయాలను ఆకళింపు చేసుకుని, సమానత్వం, బౌద్ధికత, మానవత్వం వంటి విలువలను తమ జీవితాల్లో అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్, ఎన్.సి.సి 11 ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విద్యార్థులు పాల్గొన్నారు.

# కురబలు ఐకమత్యంతో ముందుకు సాగాలి


## - కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వీ దేవేంద్రప్ప పిలుపు
## - కురబల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
## - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా



**మదనపల్లె,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కురబలు అన్ని రంగాలలో విజయం సాధించేందుకు సమయం ఆసన్నమైందని , ప్రతి ఒక్కరు ఐకమత్యంతో ముందుకు సాగాలని కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వీ దేవేంద్రప్ప పిలుపునిచ్చారు. మంగళవారం మదనపల్లె పట్టణం లో కురబ/కురమ రాష్ట్రస్థాయి నూతన కమిటీని మదనపల్లె డివిజన్ కమిటీ తరఫున ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా , కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వీ దేవేంద్రప్ప, రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షులు ఎస్.కె.మల్లికార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె రెడ్డి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడుతూ కురబలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుండడం శుభసూచకమన్నారు. కురబల జనాభా దామాషా ప్రకారం రానున్న ఎన్నికలలో ఎక్కువ మొత్తంలో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు. కురబల శ్రేయస్సు కోసం నూతన కమిటీ పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ కురబ కులస్తులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. రాజకీయంగా కురబలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కురబ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ కురబ సంఘం నూతన కమిటీ అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంటుగా తనకు మరోసారి అవకాశం కల్పించిన కురబ కుల ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు కురబల ఎదుగుదలకు కృషి చేస్తున్న మంత్రి కవితమ్మ, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, చైర్మన్ దేవేంద్రప్పలకు ధన్యవాదాలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ లక్ష్మన్న, కాంతారావు, కప్పల శ్రీనివాసులు, సదాశివ, గుడే శ్రీనివాసులు, డివి రమణ, కొప్పల రమణ, నరసింహులు, రాజన్న, సూరి, చామంచుల మల్లిక, కొప్పల హరినాథ్, కురబ కుల బాంధవులు పాల్గొన్నారు.

# మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

## - ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



**కడప, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం కడప జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు . దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ప్రజాస్వామ్య, సమానత్వ సూత్రాలపై ఆధార పడిన భారత్ కు బలమైన పునాదులు వేశారన్నారు. "బహుజన హితాయ, బహుజన సుఖాయ" అనే తత్వంతో ఆయన బహుళ సంస్కరణలను అమలు చేశారని ఎస్.పి తెలిపారు.అంబేద్కర్ ఆలోచనలు రాబోయే తరాలకు కూడా మార్గదర్శకమని, దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితం అవుదామని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీ (ఎ.ఆర్) బి. రమణయ్య, ఆర్.ఐలు, ఆర్.ఎ స్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి



**పీలేరు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు పీలేరు పట్టణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి జనసేన నాయకులు పూలమాలలు అర్పించి ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి మాట్లాడుతూ, అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పీలేరు మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ, కార్యదర్శి రాజేష్, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, ఐటీ వింగ్ సభ్యులు చరణ్, తేజ, మధు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక సేవా వారోత్సవాలు ప్రారంభం



**మదనపల్లె, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ అగ్నిమాపక సేవల వారోత్సవాలు - 2026 మదనపల్లె అగ్నిమాపక కేంద్రం లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అన్నమయ్య జిల్లా అగ్నిమాపక అధికారి వి.ఆది నారాయణ రెడ్డి అగ్ని ప్రమాదాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం శ్రీరామ్ చినబాబు చేతుల మీదుగా అగ్ని ప్రమాదాలు నివారణ చర్యల గురించి వివరించే కరపత్రాలు, గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎన్.సి.సి విద్యార్థులు, జెడ్పీ హైస్కూల్ ఎన్.సి.సి ఉపాధ్యాయులు, అభ్యుదయ హైస్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణారావు, వాసవి క్లబ్ సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు సరళ, మదనపల్లె అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ వారం రోజులు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించబడునని మదనపల్లె అగ్నిమాపక కేంద్రాధికారి జి.శివప్ప తెలియజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అగ్నిమాపక కేంద్రం వద్ద చలివేంద్రం ప్రారంభించారు.

# ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి

**మదనపల్లె, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెలుగు సంస్థలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెలుగు సెక్రటరీ యం. ఉదయ్ మోహన్ రెడ్డి , కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ఈసీ మెంబర్ యం.సుజాత, ప్రిన్సిపాల్ పి.లీనాకుమారి, సోషల్ వర్కర్ యం.గీత ఆహ్వానించగా దివ్యాంగులు పుష్ప గుచ్చాలతో వీరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ యం.గీత మాట్లాడుతూ అంబేద్కర్ సమాజంలో అస్పృశ్యత, సాంఘిక దురాచారాన్ని రూపుమాపిన వ్యక్తి, గొప్ప విద్యావేత్త, రాజ్యాంగ నిర్మాత అని కొనియాడారు. వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సిబ్బంది చిన్నారులు, వృద్ధులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు, వృద్ధులకు, సిబ్బందికి స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో వెలుగు వార్డెన్ స్వీటీ, సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

# యువకుడు ఆత్మహత్యా యత్నం

**మదనపల్లె, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. బాధితుడి కుటుంబీకుల కథనం మేరకు.. రాచవీటివారిపల్లె పంచాయతీ, గుండ్లబురుజుకు చెందిన లేట్ శివ, విజయమ్మ దంపతుల కుమారుడు కుమార్ ఆచారి మద్యానికి అలవాటు పడ్డాడు. తల్లి మందలించడంతో మత్తులో ఇంట్లో ఉన్న ఎలుకుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు విచారణ చేస్తున్నారు.

# కలెక్టరేట్‌లో అంబేద్కర్ జయంతి

**కడప, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత డా.బి. ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ ఎస్ హాలులో.. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో.. అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో డా. బి.ఆర్.అంబేద్కర్ పోషించిన పాత్ర విశేషమైన దన్నారు. డిప్యూ టీ కలెక్టర్లు కిరణ్ కుమార్, రాకేష్ చంద్రం మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ పౌరుడిగా మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, కడప ఆర్డీవో మురళి, జెడ్పి చైర్మన్ రామ చంద్రారెడ్డి, ఎస్డీసి వెంకటపతి, డిఆర్డీఏ, కేఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, మెప్మా పిడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, జిల్లా అధికారులతో పాటు పలువురు ప్రజా, కుల సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కలెక్టర్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

# పీలేరులో ఘనంగా అంబేద్కర్ జయంతి



**పీలేరు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు పట్టణంలో ఎమ్మార్పీఎస్, టిడిపి, ఎంఎస్పి , అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్పీఎస్, ఎంఎస్పి జిల్లా నాయకులు గండికోట వెంకటేష్, టిడిపి నాయకుడు కోటపల్లి బాబు రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, అమర్నాథ్ రెడ్డి , జనసేన నాయకుడు కలప రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. తహసీల్దార్, అర్బన్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో కార్యక్రమాలు నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. బిజెపి ఆధ్వర్యంలో డీజేలు, కోలాటాలతో ర్యాలీ నిర్వహించగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, టీచర్లు, పోలీస్ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, యువ నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

**అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో...**

పీలేరు పట్టణంలో మంగళవారం భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో అంబేద్కర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకుడు ముల్లంగి కృష్ణయ్య నాయకత్వం వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహానేత అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వంగిమల్ల గురునాథ, పల్లెపోగు హరినాధ, యర్రబల్లి జనార్ధన్, హరిబాబు, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# కె.వి పల్లిలో అంబేద్కర్ జయంతి



**కంభంవారిపల్లి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కె.విపల్లి లో ఎం.డి.పి.ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల తాసిల్దార్ నరేంద్ర కుమార్, ఎంపీడీవో సుధాకర్, ఎస్సై వెంకట శివ కుమార్, ఎం.డి.పి.ఎస్ ముల్లంగి చంద్రయ్య, అమృతపురి మల్లికార్జున పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాసిల్దారు, ఎంపీడీవో, ఎస్సై మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పక్షాన నిలబడి పోరాడిన వ్యక్తిని వారు కొనియాడారు. కార్యక్రమంలో దొడ్డి హరినాథ్, అమృత్పరి శ్రీనివాసులు, ఈపూరి ఆంజనేయులు, ముల్లంగి ధనకుమార్, వాటికాల చంద్ర, గుండ్లూరు రమేష్, శ్రీరాములు, ఏఎస్ఐ వెంకటస్వామి, పోలీస్ సిబ్బంది, వీఆర్వో ఎర్రయ్య, వీఆర్ఏ శీను, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ జయంతి




**కలికిరి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.ఎస్. నటరాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. విద్యార్థులు ఆయన జీవితం నుండి ప్రేరణ పొందుతూ కష్టపడి చదివి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ రెడ్డి, శ్రీధర్ కుమార్, రమేష్ నాయక్, భాగ్యలక్ష్మి, ప్రభాత, శ్యాంప్రసాద్, దేవీప్రసాద్, నవ్నిహాల్, కృష్ణా రెడ్డి, నరేష్, రమాదేవి, ముబారక్ ఖాన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ములకలచెరువులో అంబేద్కర్ జయంతి



**ములకలచెరువు, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం ములకల చెరువు మండలంలో ఎమ్మార్పీఎస్ తంబళ్లపల్లి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు ఆదినారాయణ, నియో జకవర్గ అధ్యక్షులు ప్రతాప్ కుమార్, నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపాల్ మాదిగల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ములకలచెరువు మూడు రోడ్ల కూడలిలో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో హరి నారాయణ, ఎస్ ఐ ఉమామహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ టిడిపి నాయకులు ఎర్రగుడి సురేష్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఎంఆర్పిఎస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం రచించి, అందులో బడుగు బలహీన వర్గాలకు అనేక రిజర్వేషన్లు కల్పించిన ఘనత అంబేద్కర్ కు దక్కింద న్నారు. ఆ మహాను భావుని అడుగుజాడలలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. నాయునిచెరువుపల్లి రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు కట్టా దొరస్వామి నాయుడు, మండల కన్వీనర్ పాలగిరి సిద్దప్ప, పలువురు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ములకలచెరువు గ్రామ సచివాలయంలో ఎంపీడీవో హరి నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయ కులు కృష్ణప్ప, శ్రీరాములు, విజయ్ కుమార్, రమణ, మల్లికార్జున, చంద్ర, బయన్న, హరి, రామకృష్ణ, తోపు రమణ, ఎం ఈ ఎఫ్ నాయకులు టీచర్ నరసింహులు, సోషల్ వెల్ఫేర్ హరి, పోస్ట్ మాన్ రఘునాథ్, వడ్డెర సంఘంనాయకులు నాగ మల్లప్ప,జనసేన పార్టీనాయకులు, బాస్‌నాయకులు, పాల్గొన్నారు.

# సామాజిక చైతన్యమూర్తి అంబేద్కర్

**కడప, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆర్ఎస్ ఎఫ్,బి సి యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వ ర్యంలో అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలు జరిగాయి. కడపలోని మహావీర్ సర్కిల్ నుండి కలెక్టరేట్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు . అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతో ప్రతి భారతీయునికి సమాన హక్కులు ఇచ్చిన ఒక సామాజిక చైతన్యమూర్తి అని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ యాదవ్ కొనియాడారు.

# హెల్మెట్ తప్పనిసరి -- ప్రాణ రక్షణకే ప్రాధాన్యం

## : నందిగామలో ట్రాఫిక్ అవగాహన...




**నందిగామ ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, సీపీ రాజశేఖర్ బాబు ఉత్తర్వుల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం ఆదేశాలతో చందర్లపాడు రోడ్డులో వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో వాహనదారులకు వివరించారు. హెల్మెట్ ధరించకపోతే ప్రమాద సమయంలో తలకు తీవ్రమైన గాయాలు కావడం వల్ల ప్రాణనష్టం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పోలీసులు తెలిపారు. కాబట్టి ప్రతి బైక్ రైడర్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం వలన ప్రమాదాలు పెరుగుతున్నాయని, మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా నిషేధించబడిందని హెచ్చరించారు. ఇక ట్రిపుల్ రైడింగ్ కూడా ప్రమాదకరమని, ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం వల్ల బ్యాలెన్స్ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవి మన ప్రాణాలను కాపాడటానికి ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ట్రాఫిక్ అధికారులు తెలిపారు.

# వేసవిలో నీటిలో జాగ్రత్తలు పాటించాలి

## : మైలవరం పోలీసుల హెచ్చరిక...



**నందిగామ ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు చల్లదనం కోసం చెరువులు, వాగులు, నూతులు, స్విమ్మింగ్ పూల్స్ వైపు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలో ప్రమాదాలను నివారించేందుకు మైలవరం పరిధిలో పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలు నీటిలోకి దిగేటప్పుడు తప్పనిసరిగా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఐ కిషోర్ బాబు, ఎస్సై సుధాకర్, గిరి సాయి మాట్లాడుతూ, లోతు తెలియని నీటి ప్రాంతాల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేశారు. ఈత రాని వారు అసలు నీటిలోకి దిగకూడదని హెచ్చరించారు. చిన్నారులు నీటి దగ్గర ఉన్నప్పుడు పెద్దలు కచ్చితంగా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రమాదాలను నివారించేందుకు లైఫ్ జాకెట్లు వంటి భద్రతా పరికరాలు ఉపయోగించాలన్నారు. చెరువులు, వాగుల్లో జారిపడే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా వెళ్లకుండా సమూహంగా ఉండటం మంచిదని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానికులకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణకే ఈ సూచనలు అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాదాలను దూరం పెట్టాలని పోలీసులు కోరారు.

# డిజిటల్ అరెస్ట్' పేరుతో మోసం...

## 7 లక్షలు దోచుకున్న కేటుగాళ్లు




**విజయవాడ , ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలో 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. మాచవరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారుడిగా గుర్తించి ఫోన్ చేశారు. ఆధార్ నంబర్ మానవ అక్రమ రవాణా కేసుతో ముడిపడి ఉందని బెదిరించి, కేసు నుంచి బయటపడాలంటే డబ్బు చెల్లించాలని నమ్మబలికారు. భయంతో బాధితుడు దుండగులు చెప్పిన విధంగా విడతలవారీగా మొత్తం ?7 లక్షలు బదిలీ చేశాడు. తరువాత మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# కంచికచర్లలో దారుణం...

## నిద్రిస్తున్న మహిళపై కత్తితో దాడి...



**నందిగామ ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్ల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై గుర్తుతెలియని అగంతకుడు కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో బాధితురాలికి భుజం, ఛాతి, ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి కేకలు విని మేల్కొన్న కుటుంబ సభ్యులు, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకునేలోపే నిందితుడు పరారయ్యాడు. వెంటనే గాయపడిన మహిళను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ దాడి వెనుక కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గ్రామంలో ఈ ఘటనతో భయాందోళన నెలకొంది.

# మ్యాట్రిమోని పేరిట మోసం...

## "5000 మ్యారేజ్‌లు చేశాను" అంటూ 9వేలు దోపిడీ...

**నందిగామ ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆన్‌లైన్ మ్యాట్రిమోని ద్వారా పరిచయమైన వ్యక్తి చేత మోసం జరిగిన ఘటన చందర్లపాడు మండలంలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, "ఇప్పటివరకు 5000 మ్యారేజ్‌లు చేశాను... మీకు కూడా మంచి సంబంధం చూస్తాను" అంటూ నమ్మబలికిన తులారి రమేష్ అనే నిందితుడు, హైదరాబాద్‌లోని మ్యాట్రిమోనీలో పనిచేస్తున్నానని చెప్పాడు. "మీ బయోడేటా పంపండి" అంటూ బాధితుడి వ్యక్తిగత వివరాలు సేకరించి, వాటితో నకిలీ ప్రొఫైల్ సృష్టించి మోసానికి పాల్పడ్డాడు. అదేవిధంగా, "మీకు దగ్గరలోనే నందిగామ మండలంలో మంచి సంబంధం ఉంది" అంటూ బాధితుడిని నమ్మించాడు. ఆ సంబంధం పేరుతో ఆ యువతి తండ్రితో రాత్రి తొమ్మిది గంటల వరకు ఫోన్‌లో మాట్లాడిస్తూ విశ్వాసం కలిగించాడు. ఈ క్రమంలో వివిధ అవసరాల పేరుతో దశలవారీగా డబ్బులు అడిగి, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా మొత్తం రూ.9,000 వసూలు చేశాడు. డబ్బులు అందుకున్న వెంటనే నిందితుడు ఫోన్ నెంబర్‌ను స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చందర్లపాడు మండలం పోలీసులు దర్యాప్తు చేపట్టి, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలాంటి మ్యాట్రిమోని మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని పోలీసులు సూచించారు. ఫోన్ ద్వారా వచ్చే సంబంధాల విషయంలో పూర్తిగా ధృవీకరించుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని, డబ్బుల లావాదేవీల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని చందర్లపాడు ఎస్ఐ ధర్మరాజు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

# వేసవి తాపాన్ని తరిమికొట్టే అద్భుతమైన ఆరోగ్య పానీయాలు!



**విజయవాడ , ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వేసవిలో కృత్రిమ రంగులు, ఎక్కువ చక్కెర ఉండే సాఫ్ట్ డ్రింక్స్‌కు దూరంగా ఉండండి. మన పూర్వీకులు చెప్పిన ఈ సహజ పానీయాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోండి: గుల్‌కంద్ పాలు: పాలలో గుల్‌కంద్ కలిపి తాగితే చర్మ సమస్యలు తగ్గి, ఒంటి వేడి తగ్గుతుంది. పచ్చి మామిడి పానీయం (ఆమ్ పన్నా): ఎండదెబ్బ తగలకుండా రక్షిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరు స్తుంది. తాటి ముంజల డ్రింక్: ముంజలను కొబ్బరి నీళ్లు లేదా పాలలో కలిపి తీసుకుంటే తక్షణ శక్తి లభిస్తుంది. పుదీనా-కొత్తిమీర రసం: రక్తాన్ని శుద్ధి చేస్తుంది, నోటి దుర్వాసనను పోగొడుతుంది. పానకం: బెల్లం, మిరియాల పొడితో చేసే ఈ పానీయం బాడీకి కావాల్సిన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. బార్లీ నీళ్లు: శరీరంలోని వేడిని తగ్గించి, కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. సోంపు నీళ్లు: కడుపులో మంట, ఉబ్బరాన్ని తగ్గించి జీర్ణం సులభం చేస్తుంది.

# అగ్ని ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత: డీజీపీ




**విజయవాడ , ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నేటి నుంచి విజయవాడలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్‌పేటలోని ఫైర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఫైర్ డీజీ వెంకట రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందుగా అమరవీరుల స్మృతికి నివాళి అర్పించారు. అగ్నిమాపక పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1944లో ముంబయి డాక్ పేలుడు ఘటన కారణంగా సంస్మరణదినం ఏర్పాటు చేశారన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ అక్కడి నుంచి పారిపోవాలని చూస్తారని, కానీ అగ్నిమాపక సిబ్బంది మాత్రమే లోపలికి వెళ్లి ప్రాణాలను కాపాడతారని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించడం అందరి ఉమ్మడి బాధ్యత అని వెల్లడించారు.

# తల్లిని ఇంట్లోనే ఉంచి నిప్పు పెట్టిన కుమారుడు



**ఒంగోలు ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కన్నతల్లిని ఇంట్లో ఉంచి నిప్పు పెట్టి హత్య చేసిన కుమారుడి ఉదంతం ఇది. ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉండే వెంకట రమణమ్మను కొడుకు కిషోర్ బాబు బతికుండగానే నిప్పు పెట్టి హతమార్చాడు. వెంకటరమణమ్మకు ఇద్దరు కొడుకులు. చిన్న కుమారుడు చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద కుమారుడు కిషోర్ బాబు తల్లితోనే ఉంటున్నాడు. అతడు మాంసం దుకాణం నిర్వహిస్తుంటాడు. మంగళవారం ఉదయం తల్లి నిద్రిస్తున్న సమయంలో ఇంటికి నిప్పుపెట్టాడు. ఇరుగుపొరుగు వచ్చి చూసేసరికి ఇంట్లో మంటలు చెలరేగి ఉండడంతో కిషోర్‌ను నిలదీశారు. సరైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి పారిపోయాడు. అగ్నిమాపక అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే వెంకట రమణమ్మ మంటల్లో కాలి బూడిదయ్యింది. కిషోర్ బాబుకు మతిస్థిమితం సరిగా ఉండదని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నేటి యువతకు ఆదర్శం అంబేడ్కర్



**గండేపల్లి ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అవకాశాలు లేని సమయంలో మన కోసమే కాకుండా మన వెనకున్న వారి కోసం ఏ విధంగా పోరాటం చేయాలో తెలియజేసిన మహోన్నతమైన వ్యక్తి, ఆదర్శప్రాయుడు అంబేద్కర్ అని గండేపల్లి ఎస్సై శివ నాగబాబు అన్నారు. మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, దేశ రాజ్యాంగానికి స్ఫూర్తి మన అంబేద్కర్ అని అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం, దేశం కోసం ఏ విధంగా కష్టపడాలో, ఏ విధంగా నెగ్గుకు రావాలో తెలియజేసిన మహోన్నతమైన వ్యక్తి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పోలీస్ సిబ్బందితో కలిసి నివాళులర్పించారు.

# ఇంటూరులో పీఎం సూర్యఘర్ పథకం ప్రారంభం



**అమృతలూరు ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వేమూరు నియోజకవర్గం అమృతలూరు మండలం ఇంటూరు గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకాన్ని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ఘనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల ఇళ్లపై 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందించగా, మిగిలిన వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 20.18 లక్షల ఎస్సీ, ఎస్టీ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.1.25 లక్షల వ్యయంతో ఈ పథకం అమలు కానుంది.

కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల హక్కులకు అంబేడ్కర్ కృషే ఆధారం




**బుచ్చిరెడ్డిపాలెం ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కల్పించిన హక్కుల వల్లే ఇవాళ భారతదేశంలో మహిళలు ప్రత్యేక గుర్తింపు, గౌరవం పొందగలుగుతున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. పట్టణంలోని కేఎం హాస్పిటల్ నుంచి జొన్నవాడ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో సాగిన ఈ ర్యాలీలో కార్యకర్తలు జై భీమ్.. అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగానే తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు రాజకీయంగా పెద్దపీట వేస్తుందన్నారు. బాబాసాహెబ్ చూపిన బాటలో నడిచి ఆయన ఆశయాలను అమలు చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అంబేడ్కర్.. యావత్ దేశానికే గర్వకారణం.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని జొన్నవాడ సెంటర్‌లో ఆయన విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు భీమతాటి వెంకట రమణయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ కేవలం ఒక వర్గానికే పరిమితం కాదని, యావత్ భారతదేశానికి గర్వకారణమని కొనియాడారు. ఆధునిక భారత ఆర్థిక వ్యవస్థకు పునాది వేయడంతో పాటు కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేసిన మహనీయుడని గుర్తు చేశారు. అంబేడ్కర్ చూపిన బాటలో నడవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు.

# శిర్డీ సాయినాథుడి ఆలయ అభివృద్ధికి రూ.1,01,111 విరాళం



**పెదనందిపాడు ఏప్రిల్ 14( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెదనందిపాడులోని శిర్డీ సాయినాథుడి మందిరానికి చెందిన అన్నపూర్ణాలయ అభివృద్ధికి పుసులూరుకు చెందిన మదమంచి యశ్వంత్ విరాళాన్ని అందించారు. తన ముది తాత సుబ్బారావు, ముది అవ్వ కృష్ణయమ్మ పేరిట రూ.1,01,111 విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళానికి సంబంధించిన చెక్కును మంగళవారం తన తాత సాంబశివరావు ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి రామసుబ్బారావు, కోశాధికారి సురేష్, ఉప కోశాధికారి శేషగిరిరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అత్తాశకు పోతే అయిదు లక్షలు వచ్చింది



రాను రాను రీ రిలీజులు చాలా రిస్కీ వ్యవహారాలుగా మారిపోతున్నాయి. ఏది వర్కౌట్ అవుతుందో ఏది పోతుందో ముందే పసిగట్టడంలో డిస్ట్రిబ్యూటర్లు విఫలమవుతున్నారు. అలాంటిదే ఒకటి మలయాళంలో జరిగింది. ఫ్యామిలీ క్రైమ్ థ్రిల్లర్ అనే కొత్త జానర్ ని పరిచయం చేసి కోట్ల వసూళ్లు ఎలా కొల్లగొట్టవచ్చో నిరూపించిన బ్లాక్ బస్టర్ గా దృశ్యం ఎంత చరిత్ర సృష్టించిందో తెలిసిందే. 2013లో రిలీజైన ఈ క్లాసిక్ ని తెలుగులో వెంకటేష్, హిందీలో అజయ్ దేవగన్ రీమేక్ చేసుకున్న సంగతి తెలిసిందే. కొంత గ్యాప్ తర్వాత దృశ్యం 2 కరోనా పరిస్థితుల వల్ల 2021లో నేరుగా ఓటిటిలో రిలీజయ్యింది. తెలుగులో కూడా డిజిటల్ బాట పట్టింది. త్వరలో దృశ్యం 3 రిలీజ్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో రెండో భాగాన్ని థియేటర్ రిలీజ్ చేసి కాసింత డబ్బులు చేసుకుందామని ప్లాన్ చేసుకున్న మలయాళ నిర్మాతలకు షాక్ కొట్టింది. ఏప్రిల్ 10 విడుదల చేస్తే అయిదు లక్షల కంటే తక్కువ వసూళ్లు వచ్చాయని మల్లువుడ్ టాక్. అంటే పబ్లిసిటీ ఖర్చులు, డిస్ట్రిబ్యూషన్ వ్యయం కూడా వెనక్కు రాలేదు. అయినా క్రైమ్ థ్రిల్లర్స్ లో సెలెబ్రేట్ చేసుకునే అంశాలు తక్కువగా ఉంటాయి. సస్పెన్స్ తెలిసిపోయి ఉంటుంది కాబట్టి మరోసారి దాన్ని ఎంజాయ్ చేయలేరు. అందులోనూ పాటలు, ఫైట్లు లేని దృశ్యం లాంటివి మళ్ళీ థియేటర్లో చూడాలని జనాలు కోరుకోరు. అందుకే వెంకటేష్ అభిమానులు అప్పట్లో ఒత్తిడి చేసినా సురేష్ బాబు చలించకుండా దృశ్యం 2ని డైరెక్ట్ ఓటిటికి ఇచ్చారు. నారప్ప కూడా డిజిటల్ స్ట్రీమింగ్ అయ్యాక లిమిటెడ్ థియేటర్లలో రిలీజ్ చేశారు. దీని సంగతలా ఉంచితే ఇరాన్ లో యుద్ధ వాతావరణం దృష్ట్యా దృశ్యం 3 విడుదల వాయిదా పడింది. మేలో ప్లాన్ చేస్తున్నారు. హిందీ వెర్షన్ వేరే కథతో రూపొందుతుండగా తెలుగులో చేసేందుకు వెంకటేష్ అంత సుముఖత చూపించలేదని ఇన్ సైడ్ టాక్. ఆదర్శ కుటుంబం, అనిల్ రావిపూడి సినిమాలతో బిజీగా ఉన్న వెంకీ డిసెంబర్ దాకా దొరికేలా లేరు. ఆలోగా దృశ్యం 3 మలయాళం, హిందీ తాలూకా ట్విస్టులు అన్నీ ఓపెన్ అయిపోతాయి. సో తెలుగులో తీస్తారో లేదో చూడాలి.

## నానిని టార్గెట్ చేయడం రైటేనా



సెలబ్రిటీలు ఏదైనా విషయం గురించి స్పందిస్తే చాలు దాన్ని చిలవలు పలవలు చేయడానికో టీమ్ సోషల్ మీడియాలో రెడీగా ఉంటుంది. తాజాగా డెకాయిట్ ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ న్యాచురల్ స్టార్ నానితో కలిసి ఒక వీడియో ఇంటర్వ్యూ చేశాడు. తాను నిర్మించిన హిట్ 2 హీరో, హిట్ 3లో క్యామియో చేసిన శేష్ అంటే నానికి ప్రత్యేకమైన బంధం ఉండటంలో ఆశ్చర్యం లేదు. అందుకే ప్యారడైజ్ లో బిజీగా ఉన్నప్పటికీ అడివి శేష్ కోసం సమయం కేటాయించాడు. ఇందులో భాగంగా నాని అన్నమాటలు జనాలకు రకరకాల అర్థాల్లో వెళ్లిపోయాయి. డెకాయిట్ చూశాక ఒక ప్రేక్షకుడిగా తాను గౌరవింపబడ్డ ఫీలింగ్ కలిగిందని, ఈ మధ్య కొందరు మేకర్స్ ఆడియన్స్ ని తక్కువగా చూస్తూ మీకిదే ఎక్కువనే తరహాలో ప్రవర్తిస్తున్నారని చిన్న చురక వేశాడు. ఆయన అన్నది ఫలానా నిర్మాతనేనని కొందరు ట్వీట్లు చేయడం మొదలుపెట్టారు. అయితే అదే ప్రొడ్యూసర్ తో నాని ఒక కల్ట్ క్లాసిక్ చేసిన విషయాన్ని వాళ్ళు తేలిగ్గా మర్చిపోతున్నారు. అంతే కాదు మేజర్, గూఢచారి కంటే డెకాయిట్ చాలా బాగుందని నాని పెద్ద స్టేట్ మెంట్ ఇచ్చాడు. ఇది నిజమా కాదానేది పక్కనపెడితే స్నేహ ధర్మం, అందులోనూ సాటి హీరో ఎంతో కష్టపడి ఇంత పెద్ద సినిమా చేసినప్పుడు పొగడ్తల మీటర్ కాస్త పైనే ఉంటుంది. అంతెందుకు ఇది అందరూ చేసే పనే. బైకర్ మీద ఇంతకన్నా గొప్పగా వారం రోజులకు పైగానే ఎందరో పొగడ్తల వర్షం కురిపించారు. కానీ ఇంకా బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి కష్టపడుతోంది. సో నాని అన్నాడని లేక అనలేదని డెకాయిట్ కలెక్షన్లు పెరగడం తరగడం ఉండదు. జనాలు చాలా తెలివైన వాళ్ళు. గుడ్డిగా థియేటర్లకు వెళ్లే పరిస్థితిలో లేరు. కాకపోతే అడివి శేష్ ఏర్పరుచుకున్న నమ్మకం డెకాయిట్ కొచ్చిన మిక్స్డ్ టాక్ తట్టుకునేలా చేసి మంచి ఓపెనింగ్స్ తెచ్చింది. థియేటర్ లెక్కల్లో సూపర్ హిట్ అవుతుందా లేదానేది ఇంకో అయిదారు రోజులు ఆగితే క్లారిటీ వస్తుంది. ఏది ఏమైనా నానిని కొందరు లక్ష్యంగా పెట్టుకోవడం మాత్రం ఊహించని వింత.

## కుస్తీ యోధుడిగా చరణ్... పెద్ద కథే



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కొత్త సినిమా 'పెద్ది'కి సంబంధించి ప్రతి ప్రోమో ఆకట్టుకుంది. చివరగా ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్ అందరూ అవాక్కయ్యేలా చేసింది. ఈ చిత్రంలో చరణ్ క్రికెటర్‌గా మాత్రమే కనిపించబోతున్నాడని అనుకుంటూ ఉంటే.. ఒక్కసారిగా కుస్తీ యోధుడి అవతారం ఎత్తి పెద్ద షాకిచ్చాడు. కుస్తీ యోధుడు అంటే కొన్ని రోజులు జిమ్‌లో కష్టపడి కాస్త కండలు పెంచి కనిపించడం కాదు. నెలల తరబడి శ్రమించి, నిజమైన రెజ్లర్ ఎలా ఉంటాడో అలాగే తయారయ్యాడు చరణ్. ఇంకా చెప్పాలంటే రియల్ రెజ్లర్లను మించిన బాడీతో కనిపించాడు అన్నా కూడా అతిశయోక్తి కాదు. ఐతే ఇందుకోసం జాతీయ స్థాయి రెజ్లింగ్ కోచ్‌ను పెట్టుకున్నాడట చరణ్. ఆ కోచ్.. బాలీవుడ్లో రెజ్లింగ్ నేపథ్యంలో వచ్చిన సుల్తాన్, దంగల్ చిత్రాలకు కూడా పని చేశాడట. రెజ్లర్ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం ఆ కోచ్‌తో కలిసి ఐదు నెలల పాటు కష్టపడినట్లు చరణ్ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఆ కోచ్ తనను బాగానే కష్టపెట్టాడని.. ఒక దశలో ఆ కష్టం తట్టుకోలేక "సర్‌జీ నేనేమీ రెజ్లింగ్ నేషనల్స్ కోసం వెళ్లట్లేదు" అని అన్నట్లు చరణ్ తెలిపాడు. ఐతే అంత శ్రమించడం మంచి ఫలితాన్నే ఇచ్చిందని, సినిమాలో ఈ ఎపిసోడ్ స్పెషల్‌గా ఉంటుందని చరణ్ అన్నాడు. ఇక తన కుటుంబం, పిల్లల గురించి కూడా చరణ్ ఈ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. తాను ముగ్గురు పిల్లల తండ్రిని అని, వారి విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తానని చరణ్ వ్యాఖ్యానించాడు. తన పిల్లలు రిచ్ కిడ్స్‌గా పెరగాలని అనుకోవట్లేదని.. వారికి కష్టం విలువ తెలియాలని.. అందుకోసం వారితో నేను కఠినమైన తండ్రిగానే వ్యవహరిస్తానని చరణ్ స్పష్టం చేశాడు. తన పిల్లలు ధైర్యంతో, సాహసవంతులుగా పెరగాలని కోరుకుంటున్నట్లు చరణ్ తెలిపాడు. తన ప్రపంచం కుటుంబం, పెంపుడు జంతువులే అని చరణ్ పేర్కొన్నాడు.




## మన నిర్మాతలకు గట్స్ ఎక్కువ బ్రో



ఎరుకేమో.. ఇండియాలోనే బిగ్గెస్ట్ ఫిలిం ఇండస్ట్రీల్లో ఒకటిగా పేరు. భారీ బడ్జెట్లు, రికార్డు బిజినెస్‌లు, కళ్లు చెదిరే పారితోషకాలు.. చివరికి చూస్తేనేమో వసూళ్లు అంతంతమాత్రం. సక్సెస్ రేట్ అంతకంతకూ తగ్గిపోతూ.. పది చిత్రాల్లో ఏడెనిమిది సినిమాలకు పెట్టిన డబ్బులు వెనక్కి రావడం కష్టమైపోతోంది. చాలా సినిమాలకు బడ్జెట్లు హద్దులు దాటిపోయి డెఫిషిట్లో రిలీజవుతున్న పరిస్థితి. అయినా సరే.. నిర్మాతలేమీ తగ్గట్లేదు. హీరోల మార్కెట్ పరిమితులు చూడకుండా.. భారీగా ఖర్చు పెట్టేస్తున్నారు. దర్శకుల భారీ విజన్‌కు దృశ్యరూపం ఇవ్వడానికి రాజీ లేని ప్రయత్నం చేస్తున్నారు. టాలీవుడ్లో లేటెస్ట్‌గా వచ్చిన 'భరతవర్ష' సినిమా టీజర్ చూస్తే.. మన హీరోల మీద నిర్మాతల నమ్మకం ఎలాంటిదో అర్థమవుతుంది. ఈ చిత్ర కథానాయకుడు గోపీచంద్ చివరగా ఎప్పుడు హిట్టు కొట్టాడో తన అభిమానులకు కూడా గుర్తుండకపోవచ్చు. ఎప్పుడో 2014లో వచ్చిన 'లౌక్యం' తర్వాత అతడికి నిఖార్సయిన హిట్ లేదు. ఆ తర్వాత జిల్, గౌతమ్ నంద, సీటీమార్ లాంటి విషయం ఉన్న సినిమాలు చేసినా.. అవి అంతిమంగా అతడికి ఆశించిన విజయాలు అందించలేదు. చివరి చిత్రం 'విశ్వం'తోనూ అతను నిరాశపరిచాడు. ఇలా పుష్కర కాలంగా హిట్టు లేని హీరో మీద నిర్మాత శ్రీనివాస చిట్టూరి భారీ బడ్జెట్ పెట్టి 'భరత వర్ష' తీస్తున్నాడు. ఇది 'ఘాజీ' దర్శకుడు సంకల్ప్ రెడ్డి రూపొందిస్తున్న చిత్రం. 'ఘాజీ' తర్వాత అతను 'అంతరిక్షం' సినిమాతో షాక్ తిన్నాడు. ఈసారి గోపీచంద్‌తో ఒక భారీ ఈవెంట్ ఫిలిం ప్లాన్ చేశాడు సంకల్ప్. శతాబ్దాల కిందటి కథతో ఇది తెరకెక్కుతోంది. అప్పటి వ్షతావరణాన్ని తెరపైకి తీసుకురావడమే సవాలంటే.. అందులో యుద్ధాలకు తోడు భారీ ఎపిసోడ్లు చాలానే ఉండబోతాయని టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ రోజుల్లో ఇలాంటి సినిమా తీయాలంటే వంద కోట్లకు తక్కువ బడ్జెట్ కాదు. 'భరత వర్ష' బడ్జెట్ ఎంత అన్నది చెప్పలేదు కానీ.. గోపీచంద్ కెరీర్లోనే హైయెస్ట్ అని అర్థమవుతోంది. ఇన్ని ఫ్లాపుల తర్వాత కూడా గోపీని నమ్మి ఇంత భారీ సినిమా తీస్తున్న నిర్మాత గట్స్‌కు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఇక సంకల్ప్ సైతం ఈసారి భారీ విజన్‌తోనే రెడీ అయినట్లున్నాడు. టైటిల్ గ్లింప్స్‌లో విజువల్స్ సహా అన్నీ గొప్పగా అనిపించాయి. అన్నీ కుదిరితే.. 'భరత వర్ష' టాలీవుడ్లో ఒక సెన్సేషన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# బిజినెస్ న్యూస్




## గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల ప్రవాహం.. ఏడాదిలో 6 రెట్లు జంప్

గతేడాదితో పోలిస్తే పసిడి ధర అమాంతం పెరగడంతో దీంట్లో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెద్ద మొత్తం పెట్టి భౌతిక బంగారం కొనలేని వారు.. చిన్న మొత్తంతో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెట్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్‌లు) కొనుగోలుకు మొగ్గు చూపుతున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ క్రమంలోనే మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.31,561 కోట్ల విలువైన పెట్టుబడులు తరలివచ్చాయి. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఈ మొత్తం ఆరు రెట్లు పెరగడం గమనార్హం. అంతకుముందు త్రైమాసికంలో రూ.23,132 కోట్లతో పోల్చినా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి 36 శాతం మేర పెట్టుబడులు పెరగడం గమనార్హం. ఈ ఏడాది జనవరి నెలలో అత్యధికంగా రూ.24,040 కోట్లు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రాగా.. ఫిబ్రవరిలో రూ.5,255 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మార్చి నెలలో ఈ మొత్తం తగ్గి రూ.2,266 కోట్లు మాత్రమే పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ (యాంఫీ) డేటా వెల్లడించింది. ఈ ఏడాది ఆరంభంలో బంగారంలో బలమైన వృద్ధి తర్వాత ధరలు నార్మల్ అవడం, కొత్త కేటాయింపుల్లో కొంత తగ్గుదల వంటి కారణాలు మార్చిలో ప్రతిఫలించినట్లు అనలిస్టులు పేర్కొం టున్నారు. రిస్క్‌ను తట్టుకునే పెట్టుబడి సాధనంగా బంగారానికి పేరుండటం, పోర్ట్‌ఫోలియో రీబ్యాలెన్సింగ్, బంగారం ధరలు అసాధారణంగా పెరగడం వంటి కారణాలతో మిగిలిన నెలలతో పోలిస్తే జనవరిలో పెద్ద మొత్తంలో నిధులు రావడానికి కారణమయ్యాయని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియాలో సీనియర్ అనలిస్ట్ నేహల్ మేశ్రమ్ వెల్లడించారు. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నా మార్చిలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల ప్రవాహం కొనసాగడం సానుకూలాంశం అన్నారు. గోల్డ్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తుల విలువ మొత్తం గతేడాది రూ.58,888 కోట్లుగా ఉండగా.. ఏడాదిలో మూడు రెట్లు పెరిగి రూ.1.71 లక్షల కోట్లకు పెరిగింది.




## స్లిమ్ డిజైన్, బిగ్ బ్యాటరీతో రియల్‌మీ నార్జో 100 లైట్

చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ రియల్‌మీ నార్జో సిరీస్‌లో కొత్త ఫోన్ తీసుకొచ్చింది. నార్జో 100 లైనప్‌లో తొలి ఫోన్ నార్జో 100 లైట్ 5జీని మంగళవారం లాంచ్ చేసింది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీతో స్లిమ్ డిజైన్‌లో, బడ్జెట్ ధరలో ఈ ఫోన్‌ను విడుదల చేసింది. సింగిల్ ఛార్జ్‌తో 10 గంటల పాటు వీడియో ప్లేబ్యాక్, 70 గంటల మ్యూజిక్ వినొచ్చని కంపెనీ చెబుతోంది. రియల్‌మీ నార్జో 100 లైట్ 6.8 అంగుళాల ఎల్‌సీడీ స్క్రీన్‌తో వస్తోంది. 144 రిఫ్రెష్ రేట్, 900 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో డిస్‌ప్లే పనిచేస్తుంది. ఆండ్రాయిడ్ 16తో పనిచేసే రియల్‌మీ యూఐ 7.0తో పని చేస్తుంది. ఐపీ 64 రేటింగ్ కలిగిఉంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌ను అమర్చారు. రియల్‌మీ ఎయిర్‌ఫ్లో వేపర్ ఛాంబర్ కూలింగ్ సిస్టమ్ అమర్చారు. కెమెరా విషయానికొస్తే.. ఇందులో 13 ఎంపీ ప్రధాన కెమెరాతో పాటు సెకండరీ కెమెరా కూడా ఇచ్చారు. ముందువైపు 5 ఎంపీ కెమెరా ఉంది. వాటర్‌డ్రాప్ స్టయిల్‌నాచ్ ఇచ్చారు. ఇందులోని 7000 ఎంఏహెచ్ బ్యాటరీ 15ఔ వైర్డ్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 8.45 ఎంఎం మందం కలిగిన ఈ ఫోన్ బరువు 212 గ్రాములు. ఈ ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీం 64జీబీ వేరియంట్ ధర రూ.13,499, 4జీబీం 128జీబీ వేరియంట్ ధర రూ.14,499, 6జీబీం 128జీబీ వేరియంట్ ధర రూ.16,499గా నిర్ణయించారు. ఏప్రిల్ 21 నుంచి అమెజాన్, రియల్‌మీ వెబ్‌సైట్లలో కొనుగోలు చేయొచ్చు.




## మెటాకు మరో సీఈఓ.. జుకర్‌బర్గ్‌కు పోటీగా వచ్చేదెవరో తెలుసా..?



మెటాకు మరో సీఈఓ రానున్నారు. జుకర్‌బర్గ్‌కు పోటీగా ఈ టెక్ సంస్థ (వీమ్ఖ)ను నడపనున్నారు. ఇంత సడన్‌గా మెటా ఈ మార్పునకు ఎందుకు సిద్ధమవుతోందని అనిపిస్తోంది కదా. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. మెటాకు మార్క్ జుకర్‌బర్గ్ (మీథీని బఎవతీఎవతీస్త్ర) సీఈఓగా ఉన్నారు. శరవేగంగా అన్ని రంగాలకు విస్తరిస్తోన్న కృత్రిమ మేధ విస్తృత వినియోగంపై ఆయన ఆధ్వర్యంలోని సంస్థ ప్రధా నంగా దృష్టిసారించింది. సెలబ్రిటీ ఇన్‌స్పైర్‌డ్ చాట్‌బాట్లపై ప్రయోగాలు చేసింది. అయితే ఇప్పుడు రియల్ టైమ్ కమ్యూనికేషన్ కోసం ఫొటోరియలిస్టిక్, 3డీ ఏఐ క్యారక్టర్స్ అభివృద్ధి చేసే పనిలో పడిందని అంతరా తీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా జుకర్‌బర్గ్ హావభా వాలు, గొంతు, ఆయన ఇచ్చే ప్రకటనలను అనుకరించేలా ఏఐ జుకర్‌బర్గ్‌ను రూపొందించే పనిలో పడిందట. దాంతో పని ప్రదేశంలో ఆయన లేకపోయినా ఉద్యోగులకు ఆ లోటు తెలియకుండా ఉండేందుకే ఈ ఆలోచన చేస్తున్నారని తెలుస్తోంది. తన ఏఐ వర్షన్‌కు శిక్షణ, టెస్టింగ్ అంతా జుకర్‌బర్గే ఇస్తున్నారట. అందుకోసం వారానికి 5 నుంచి 10 గంటలు కేటాయిస్తున్నారని మీడియా కథనాలు వెల్లడించాయి. ఇదిగాక ఆయన 'సీఈఓ ఏజెంట్' ప్రాజెక్ట్ పైనా పని చేస్తున్నారు. సమాచారాన్ని వేగంగా సేకరించి, తనకు సపోర్ట్‌గా ఉండేందుకు ఈ ప్రాజెక్ట్‌ను తీర్చిదిద్దుతున్నారు. మెటా ఏఐ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టింది. ఓపెన్ ఏఐ, గూగుల్ వంటి పోటీ సంస్థలను దాటుకొని, పర్సనల్ సూపర్‌ఇంటెలిజెన్స్‌ను అందిస్తామని ప్రకటించింది. అలాగే ఓపెన్ సోర్స్ ఏజెంటిక్ సాఫ్ట్‌వేర్, కస్టమ్ బిల్ట్ ఆటోమేషన్ ఏజెంట్స్ వంటి ఏఐ టూల్స్‌ను వాడేలా ఉద్యోగులను మెటా ప్రోత్సహిస్తోంది. ప్రొడక్ట్ మేనేజర్ల ఏఐ నైపుణ్యాలను పరీక్షిస్తోంది. దాంతో ఉద్యోగ కోతలు ఉండొచ్చనే భయం వారిలో నెలకొంది. శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధి కోసమే తాము టెస్టింగ్ చేస్తున్నామని, తొలగింపుల కోసం కాదని సంస్థ చెప్తోంది. కానీ.. ఇటీవల రియాల్టీ ల్యాబ్స్, సేల్స్, రిక్రూటింగ్, ఫేస్‌బుక్ విభాగాల నుంచి 700 మందికి పైగా ఉద్యోగులకు మెటా (వీమ్ఖ) ఉద్వాసన పలికినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

## ఏఐకి శిక్షణ ఇస్తే.. గంటకు రూ.14వేలు




ఏఐలో సరికొత్త టూల్స్ అందించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలన్నీ పోటీ పడుతున్నాయి. ఆ టూల్స్‌ను ట్రైన్ చేయడం.. ఇప్పుడు సరికొత్త జాబ్ మార్కెట్‌ను సృష్టిస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఈ రంగంలోకి లింక్డిన అడుగు పెట్టాలనుకుంటోంది. అందులోభాగంగా 'ఏఐ లేబర్ మార్కెట్ ప్లేస్'ను పరీక్షిస్తోంది. దీని వేదికగా నిపుణులు.. ఏఐ టూల్స్‌ను మెరుగుపర్చి డబ్బు సంపాదించుకోవడానికి వీలు కలగనుంది. ప్రస్తుతం ఈ మార్కెట్ ప్లేస్ అభివృద్ధి ప్రక్రియ ప్రారంభదశలోనే ఉంది. ఇది గనుక వాడుకలోకి వస్తే.. కోడింగ్, ఫైనాన్స్, నర్సింగ్ సహా పలు రంగాలకు చెందిన వృత్తి నిపుణులు ఏఐ చాట్‌బాట్‌లతో కనెక్ట్ అవుతారు. వాటి సమాధానాలు, కచ్చితత్వాన్ని వారు సమీక్షిస్తారు. ఇందుకుగానూ నిపుణులు తమ స్కిల్స్‌ను బట్టి గంటకు రూ.3,300 నుంచి రూ.14,000 సంపాదించే అవకాశం ఉందని లింక్డిన్‌లోని లిస్టింగ్స్ బట్టి తెలుస్తోంది. భాషా నిపుణులకు ఈ వేదిక ఆదాయవనరుగా మారనుంది. ఏఐ సిస్టమ్స్‌లో లోపాలను గుర్తించే రెడ్ టీమ్ టెస్టర్లు గంటకు 40 నుంచి 50 డాలర్లు సంపాదించవచ్చని పేర్కొంది. ఈ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను సృష్టించే రంగంలో ఇప్పటికే తీవ్ర పోటీ ఉంది. మెర్కర్, సర్జ్ ఏఐ వంటి సంస్థల్లోకి భారీ పెట్టుబడులు వచ్చాయి. ఈ ఏఐ ట్రైనింగ్ ఇండస్ట్రీ ప్రస్తుతం ఫ్రీలాన్స్ కంట్రిబ్యూటర్లపై ఆధారపడుతోంది. డేటా గోప్యత, భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో ప్రముఖ సంస్థ మైక్రోసాఫ్ట్ నేతృత్వంలోని లింక్డిన్ ఈ రంగంలోకి ఎంటర్ అవుతోంది.

# ఆంజనేయ స్వామికి విశేష పూజలు



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ (ప్రతినిధి):** ముక్కంటి ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం ప్రక్కన ఉన్న అచ్యుతరాయ మండపంలోని స్తంభంలో కొలువైన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా వేద పండితులు స్వామికి పాలు పెరుగుతో అభిషేకం చేశారు. తమలపాకులతో అలంకరించి సింధూరం దిద్దారు. పూలమాలవేసి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

# అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు సాగాలి

**- జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు**



**తిరుపతి,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన విశిష్ట సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి డిఆర్ఓ నరసింహులు తదితరులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగా దేశానికి అమూల్యమైన సేవలు అందించారని, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా ప్రాధాన్యంపై ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమని, అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత అందరిదని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు కాంగ్రెస్ నేతల నివాళి



**తిరుపతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం నిత్యం పోరాటాలతోనే సాగిందన్నారు. సంఘసంస్కర్తగా, ఆర్థికవేత్తగా, అంటరానితనం, కుల నిర్మూలన కోసం అంబేద్కర్ సాగించిన పోరాట ఫలితమే అణగారిన వర్గాలు ఆ ఫలాలను అనుభవిస్తున్నారని చెప్పారు. నేటి యువతరం ఆయన జీవితాన్ని ఆదర్శంగా చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి మొదటి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా అంబేద్కర్ సేవలు అనిర్వచనీయమైనవని తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రూపొందించడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారని చెప్పారు. అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతి విద్యార్థి అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు మాట్లాడుతూ దేశంలో కులాలు, వాటి విధానాలు, పుట్టుక, అభివృద్ధి పై రచనలు చేసి ప్రజల్లో చైతన్యానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, పీసీసీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తూరు శివశంకర్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ఆమూరి కృష్ణమూర్తి కంటిపల్లి చెంగల్రాయులు, ఉపాధ్యక్షులు గొడుగుచింతల గోపి, ఎస్సి విభాగం రాష్ట్ర కన్వీనర్ బోయన నరేంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్రామయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ 135వ జయంతి



**రామచంద్రాపురం, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామచంద్రాపురం మండలంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అధికారులు, పార్టీలకు అతీతంగా దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్‌కు నివాళలర్పించారు. మండలం లో అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా అధికారులు ఆయా గ్రామ సచివాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మండలంలోని దళిత నాయకులు పార్టీలకు అతీతంగా పూలమాలలు వేసి కేకే కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండల వైసీపీ కోఆర్డినేటర్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది వేసిన రాజ్యాంగ విధాతకు శతకోటి ప్రణామాలు అన్నారు. ఓటు హక్కుతో సామాన్యుని సైతం పాలకుడుగా మాచారన్నారు. కార్యక్రమంలో మండల దళిత నాయకులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన కొవ్వూరి రామ్ దీప్ రెడ్డి అనే భక్తుడు టీటీడీ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి మంగళవారం రూ.10,01,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

# అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

**-ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు -తిరుపతిలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం గుర్తింపు - కలెక్టర్ వెంకటేశ్వర్**





**తిరుపతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ సృష్టికర్త బాబా సాహెబ్ అంబేద్కర్ అని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాల్సి ఉందని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం అంబేద్కర్ 135వ జయంతి వేడుకలలో భాగంగా తిరుపతి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, టిటిడి బోర్డు మెంబర్/ మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పరసారత్నం, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివయ్య, మాల సంక్షేమ కోఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిమెట్ల కుమారి, తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి భరత్ కుమార్, ప్రజా సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు సమాన హక్కులు, బడుగు బలహీన వర్గాల అవకాశాలు తదితరాలను దృష్టిలో ఉంచుకొని అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగం స్ఫూర్తితో ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి పథకాలు ఎన్నో అమలు చేస్తోందని, ఇందులో భాగంగా సూపర్ సిక్స్ పథకాల కింద ఏ రాష్ట్రంలో లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే ప్రతి నెల ఒకటో తారీఖున 7 గంటలకు పెన్షన్ల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు రవాణాను ముఖ్యమంత్రి ప్రారంభించడం జరిగిందన్నారు. ఉద్యోగ కల్పనలో భాగంగా డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించిందని, దీపం 2 పథకం కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ రీఫిలింగ్ అందిస్తున్నారని, రోడ్లు నిర్మాణం, నీటి సరఫరా, విద్యుత్, రూఫ్ టాప్ సోలార్ అందించడం , మౌలిక సదుపాయాలను అందించే కార్యక్రమాలను సామాన్య ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి క్వాంటం వ్యాలీ, సిలికాన్ వ్యాలీని రాష్ట్ర రాజధానికి తీసుకొచ్చారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, మన జిల్లా లో సంక్షేమ శాఖలన్నిటినీ సమన్వయపరుస్తూ పెద్ద ఎత్తున గడిచిన రెండు సంవత్సరాల నుంచి 'సంక్షేమ సంకల్పం' అనే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందన్నారు. సుమారు రూ.30 కోట్ల తో విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకోవాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టల్‌లలో తాగునీరు, మరుగు దొడ్లు, ఫ్యాన్ లు, డైనింగ్ హాల్, కిచెన్ బాగు చేయటం, చదువుకోవడానికి షెడ్లు ఏర్పాటు, లీక్ ప్రూఫ్ రూఫ్ నిర్మించడం, బాలికల హాస్టల్ కు కాంపౌండ్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధులతో 6వ తరగతి నుంచి ప్రతి ఒక్క పిల్లాడికి క్లాసెస్ నిర్వహించడం జరుగుతోందన్నారు, చంద్రగిరిలో రూ. 3 కోట్లతో సాంఘిక సంక్షేమ హాస్టల్ పనులు మొదలయ్యాయని, తిరుపతి పట్టణంలో ఎస్‌సి, ఎస్టీ బాలురకు హాస్టల్ మంజూరు చేసిందన్నారు. మొట్టమొదటిసారిగా తిరుపతి జిల్లాలోనే ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి నెల చివరన 'సివిల్ రైట్స్ డే' ప్రతి మండలంలో ఎస్‌ఐ, తాహసిల్దార్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా చేస్తూ, అట్రాసిటీస్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా స్థాయిలో 'డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ' ఉంటుందని, దీంట్లో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల గ్రీవెన్సెస్, అట్రాసిటీస్ మీద ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తూ, ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నామన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఇంటి స్థలాలు, ఇళ్లు, భూ సమస్యల మీద దృష్టి పెడతామన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం ఎస్సీ గ్రామాలు ఉన్నాయని అయినప్పటికీ అంబేద్కర్ భవన్ లేదని కోరగా స్టేట్ అంబేద్కర్ భవన్ నిర్మాణానికి తిరుపతి పట్టణంలో ఒక ఎకరా 15 సెంట్లు మంగళంలో గుర్తించడం జరిగిందని, త్వరలో అంబేద్కర్ భవన్ నిర్మించడానికి ప్రతిపాదన సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని కలెక్టర్ తెలిపారు.

# గొల్లవానిగుంటలో ఆధునిక క్రీడా స్టేడియం నిర్మాణం

**-సిఎస్ఆర్ - పిపిపి మోడల్ ద్వారా ప్రాజెక్ట్ అమలు -చంద్రగిరిలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్ నిర్మాణం**

**-తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో బాక్సింగ్ రింగ్ నిర్మాణం - నేడు ప్రారంభించనున్న మంత్రి నారా లోకేష్**



**తిరుపతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గొల్లవాని గుంటలో రూ.10.10 కోట్లతో నిర్మించిన ఆధునిక క్రీడా స్టేడియం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించనున్నారని శాప్ చైర్మన్ రవి నాయుడు వెల్లడించారు. క్రీడా ప్రాధికార సంస్థ తుడ సహకారంతో ఈ స్టేడియం నిర్మించినట్లు తెలిపారు. సిఎస్ఆర్ – పిపిపి మోడల్ ద్వారా ఈ గ్రౌండ్ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఈ స్టేడియంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ వంటి క్రీడలను నిర్వహించేందుకు అనుకూలమైన మైదానాలు ఏర్పాటు చేశామని, ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక అకాడమీని, ప్రజల కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, తిరుపతిలో మెరుగైన క్రీడా వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు చదువుకున్న చంద్రగిరి బాయ్స్ హైస్కూల్‌లో రూ.3.25 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఇండోర్ హాల్ నిర్మితమైందని, ఇందులో రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, చెస్, టేబుల్ టెన్నిస్, యోగా మరియు జిమ్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. చంద్రగిరి ప్రాంతం ఒకప్పుడు హాకీకి కేంద్రంగా నిలిచి అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించిన ఘనత కలిగి ఉందని గుర్తు చేశారు. రెండుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న రజిని చంద్రగిరిలోనే శిక్షణ పొందినట్లు తెలిపారు. మాజీ శాసనసభ్యులు నారా రామమూర్తి నాయుడి సేవలను స్మరించుకుంటూ, క్రీడా సంఘాల అభ్యర్థన మేరకు ఆ ఇండోర్ హాల్‌కు నారా రామమూర్తి నాయుడు క్రీడా ప్రాంగణం"గా నామకరణం చేసినట్లు రవినాయుడు వెల్లడించారు.. చంద్రగిరిలో హాకీ ఫీల్డ్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 200 మంది క్రీడాకారులు వసతి పొందే విధంగా అకాడమీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో బాక్సింగ్ రింగ్ నిర్మాణం జరుగుతోందని, దీనిని నారా లోకేష్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒలింపిక్ వెయిట్‌లిఫ్టర్ కరణం మల్లేశ్వరి పేరుతో వెయిట్‌లిఫ్టింగ్ అకాడమీని ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గూడూరులో రూ.2.25 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ హాల్ నిర్మాణం పూర్తి చేసినట్లు, సూళ్లూరుపేటలో రూ. 2.75 కోట్లతో అవుట్‌డోర్ మరియు ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. నారా లోకేష్ తో పాటు తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ అనగాని సత్య ప్రసాద్, రవాణా , క్రీడాశాఖ మంత్రి మండెపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

# టీటీడీకి రూ.27లక్షలు విరాళం




**తిరుమల, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కర్ణాటక రాష్ట్రం బెలగావికి చెందిన ప్రవీణ్ సోన్వాల్కర్ మంగళవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షలు విరాళంగా అందించారు. అదేవిధంగా శ్రీ సుభాష్ సోన్వాల్కర్ అనే భక్తుడు కూడా శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు.

# స్విమ్స్‌లో వరల్డ్ హెల్త్ డే పోటీల విజేతలకు సర్టిఫికేట్లు



**తిరుపతి, ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాస రచన , ఎలక్యూషన్ పోటీల విజేతలకు స్విమ్స్ సంచాలకులు/ఉపకులపతి ఆర్.వి.కుమార్ సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. సంచాలకుల కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని స్విమ్స్‌లో ఆరోగ్యం కోసం ఐక్యంగా. విజ్ఞాన శాస్త్రానికి మద్దతుగా నిలవండి) అనే థీమ్ తో ఘనంగా నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సంబంధిత ప్రతి నిర్ణయం సైన్సు ఆధారంగా ఉండాలని, నిర్ధారణ, చికిత్స, ప్రజారోగ్య విధానాల వరకు శాస్త్రీయ ఆధారాలు కీలకమని పేర్కొన్నారు. తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న ఈ కాలంలో, వైద్యులు, ఆరోగ్య నిపుణులు ప్రజల్లో నమ్మకం పెంచే బాధ్యత వహించాలని సూచించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. కె. నాగరాజ్ మాట్లాడుతూ వ్యాక్సినేషన్, పర్యావరణ ఆరోగ్యం వంటి రంగాల్లో శాస్త్రీయ పురోగతి అవసరమని, ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత ముఖ్యమని తెలిపారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలో ఎంబి.బి.ఎస్ విద్యార్థినులు ఎస్. పూజిత, పి. ఉషశ్రీ, బి. కౌశల్య హరిణి విజేతలుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. వ్యాసరచన పోటీలో ఎం.బి.బి.ఎస్ విద్యార్థినులు పి. ఉష శ్రీ, పి. నీరజ,జి. వైష్ణవి, ఫిజియోథెరపి విద్యార్థినులు హేమ, తస్లీం,ఎలక్యూషన్ పోటీలో ఎం.బి.బి.ఎస్ విద్యార్థినులు : జి. చార్మి, ఆఫ్రీన్ షేక్,జయంతి రెడ్డి,నర్సింగ్ విద్యార్థిని ఐశ్వర్య, అలైడ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థి నాగరాజు విజేతలుగా నిలిచారు.

# నగరపాలక సంస్థలో అంబేద్కర్ జయంతి



**తిరుపతి,ఏప్రిల్ 14 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజ్యాంగనిర్మాత భారతరత్న డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్ర పటానికి కమిషనర్ ఎన్.మౌర్య, అధికారులు పుష్పంజలి సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు. సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం, విద్య, శాంతిని నెలకొల్పేందుకు కృషి చేసిన మహోన్నత నాయకుడు అని కొనియాడారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం అందరికీ మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హాసీమ్, వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్ పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027